Rs. 12/- per copy

# విద్యార్థి జ్వాల

Vol. 31 - No.5

March 2025




## ప్రేషిత సేవలో పాల్గొందాం

5లో

# తోటివారికి చేసే గొప్ప మేలు

రాత్రి సమయంలో ఒక అపార్ట్‌మెంట్‌కు నిప్పు అంటుకున్నది. అందులో ఉన్న ఒక వ్యక్తికి మెలకువ వచ్చింది. అప్పుడు తన ప్రాణాన్ని కాపాడుకోవడానికి ఒక్కడు మాత్రమే గబగబా బయటకు పరుగెత్తుకొని వస్తే అతడు సామాజిక బాధ్యతలేని స్వార్థపరుడవుతాడు. కానీ అలా కాకుండా, వెంటనే అతడు తన అపార్ట్‌మెంట్‌లో ఉన్నవారందరికీ వినబడేటట్లు "ఈ అపార్ట్‌మెంట్‌కు నిప్పు అంటుకుంది అందరూ బయటకు రండి" అని గట్టిగా అరుస్తూ హెచ్చరిస్తే సాటి మనిషి పట్ల నైతిక బాధ్యత ఉన్నవాడు అవుతాడు. ఎందుకంటే అగ్నికి ఆహుతి అయ్యేవారిని హెచ్చరించి కనీసం కొంతమందినైనా కాపాడాలని అతని ప్రయత్నం. అలాకాకుండా ఎవరు ఎలా పోతే నాకెందుకు నన్ను నేను కాపాడుకుంటే సరి పోతుందిలే అని ఎవ్వరూ అనుకోరు, అలా అనుకుని తనను తాను మాత్రమే రక్షించుకుని బయటకు వస్తే దానికి మించిన అపరాధం మరొకటి ఉండదు.

మేలైనది చేయడం తెలిసి కూడా చేయకపోతే పాపం అని బైబిలు చెబుతుంది (యాకోబు 4:17). నశించిపోయే మానవాళికి, చనిపోయిన తర్వాత నిత్యాగ్నికి పరుగులెత్తుతున్న వారికి దానిని తప్పించుకొనే మార్గం క్రీస్తే అని తెలిసి కూడా ఆ శుభవార్తను ప్రకటించకపోతే మనం పాపం చేస్తున్నట్లే. విశ్వాసులుగా మన తోటివారికి చేయాల్సిన గొప్ప మేలు సువార్తను ప్రకటించడమే. అగ్నిలోనుండి లాగినట్టు 'కొందరినైనా రక్షించడమే' (యూదా 1:23).

"సువార్త నిజంగా శుభవార్త అని మనం నమ్మితే తోటివారికి చెప్పకుండా ఉండలేము, ఖాళీగా కూర్చో లేము, సాకులు చెప్పలేము. వారు రక్షణ పొందేంత వరకు అపొస్తలుడైన పౌలువలె ప్రార్థిస్తూ, ప్రయాస పడతాము. ఎందుకంటే సువార్త నిత్యత్వంతో ముడిపడి ఉంది. సువార్త ప్రకటన అనేది మనం ఇష్టపడితే చేసేది కాదు. అది దేవుని పిల్లలందరికీ దేవుడు ఇచ్చిన ఒక ఆజ్ఞ, బాధ్యత కూడా (మార్కు 16:15). గనుక మన తోటివారితో సువార్తను పంచుకోవాలనే ప్రగాఢమైన వాంఛ మనకు ఉండాలి. ఈ క్రమంలో మనకు అనేక అవాంతరాలు, వ్యతిరేకత ఎదురవ్వొచ్చు. "క్రీస్తు సువార్తను, బోధను తిరస్కరించడానికి ప్రజలు ఎంత గట్టి తీర్మానం తీసుకుంటారో, దైవ సేవకులు అంతే గట్టిగా తృష్ణ, ఆకాంక్షలతో, పట్టు విడవకుండా, తమ శక్తి వంచన లేకుండా ఎంతో జాగ్రత్తతో సాతాను దాడులను నిర్వీర్యం చేస్తూ సత్య సువార్తను ప్రకటించాలని" జాన్ కాల్విన్ అంటాడు.

సువార్తను ప్రకటించే విషయంలో అపొస్తలుడైన పౌలు తీర్మానాలు ఎంతో గొప్పవి. "గ్రీసు దేశస్థులకును గ్రీసుదేశస్థులు కాని వారికిని, జ్ఞానులకును మూఢులకును నేను ఋణస్థుడను, నావలనైనంతమట్టుకు... సువార్త ప్రకటించుటకు సిద్ధంగా ఉన్నాను, సువార్తను గూర్చి నేను సిగ్గుపడువాడను కాను" (రోమా 1:14-16), సువార్త ప్రకటించాల్సిన భారం నామీద మోపబడియున్నది, సువార్తను ప్రకటించకపోయిన యెడల నాకు శ్రమ (1 కొరింథీ 9:16) అని చెబుతాడు. పౌలుకు సువార్త ప్రకటించకపోతే శ్రమ. మనకు సువార్త ప్రకటించడమే శ్రమ. సువార్త విషయంలో పౌలు హృదయంలో గొప్ప వేదన కలిగి అప్పటికే తెలిసిన భూభాగం అంతటికి సువార్తను ప్రకటించాడు. సువార్తను ప్రకటించే వారు లేకుండా ప్రజలు ఎలా వింటారు, విశ్వసిస్తారు, ప్రార్థిస్తారు, రక్షణపొందుతారని ప్రశ్నిస్తూ, సువార్త ప్రకటించే వారి పాదములు ఎంతో సుందరములు అని కితాబిచ్చాడు (రోమా 10:14).

సువార్త విలువనెరిగిన డేవిడ్ బ్రైనార్డ్, డేవిడ్ లివింగ్‌స్టన్, హడ్సన్ టేలర్, సి.టి.స్టడ్, అదోనిరామ్ జడ్సన్, జిమ్ ఇలియట్, డియల్ మూడి, విలియమ్ కేరి, సాధు సుందర్ సింగ్, పండిత రమాబాయి, బిల్లీ గ్రేహం, భక్త సింగ్ లాంటి గొప్ప భక్తులు ప్రపంచవ్యాప్తంగా సువార్తను మ్రోగించారు. సువార్తకే తమ జీవితాలను అంకితం చేసుకొని జీవించారు. సువార్త కొరకే చనిపోయారు.

యుఇయస్ఐలోని మన పితరులు తమ జీవితాన్ని సువార్త కేంద్రీకృతంగా మలచుకొన్నారు. నశించిపోయే ఆత్మల రక్షణ కొరకు అంగలార్చారు, వారి గృహాలు తెరిచారు, ఖర్చుపెట్టారు, సుఖాలు వదులుకున్నారు, బరువులు మోశారు, బంధాలు పెంచుకున్నారు, అనుబంధాలు తుంచేసుకున్నారు, అవమానాన్ని భరించారు, పవిత్రంగా జీవించారు, పరుగెత్తారు, ప్రయాణాలు చేశారు, క్రొవ్వొత్తిలా కరిగిపోయి దావీదు వలె తమ తరానికి గొప్ప సేవ చేసి నిద్రించారు.

నశించిపోయే ఆత్మల రక్షణ కొరకు అపొస్తలుడైన పౌలు, మిషనరీస్, మన పితరుల వలె తపించి, ప్రయాసపడే విద్యార్థులు, గ్రాడ్యుయేట్స్ మన పరిచర్యలో కొద్దిమందే ఉన్నారు. చాలామంది పరిచర్యలో ప్రేక్షకపాత్ర వహిస్తున్నారు. విద్యార్థి పొలంలోకి దిగి పని చేయడానికి, కష్టపడడానికి, నష్టపోవడానికి వారికి బోలెడన్ని ఆటంకాలు ఉంటాయి. అందుకనే గొప్పగా ప్రణాళికలు వేసినంతగా పరిచర్య విస్తరణ గొప్పగా జరగడంలేదు.

కొంతమంది తమ జీవితాన్ని **వేస్ట్** చేసుకుంటారు, కొంతమంది తమ జీవితాన్ని **ఎంజాయ్** చేస్తారు, మరి కొంతమంది తమ కుటుంబం కోసమే తమ జీవితాన్ని **స్పెండ్** చేస్తారు. కేవలం కొద్దిమంది మాత్రమే ప్రభువు మనస్సు కలిగి అనేకులను దేవునివైపు తిప్పుతూ, దేవుని పరిచర్యలో **క్యాండిల్‌లా కరిగిపోతూ** అనేకులకు వెలుగుగా, ఆశీర్వాదంగా ఉంటారు. మనం ఏ కేటగిరీలో ఉన్నాం?

– **పి. సునీల్ జాకబ్,** అసోసియేట్ ఎడిటర్

విద్యార్థి జ్వాల



Vol. 31, No. 5. March 2025
A Publication of
Union of Evangelical Students of India



EDITORIAL BOARD:

Mr. B.J. Lazarus, Editor
Mr. P. Sunil Jacob - Associate Editor
Dr. J. Ratna Grace - Member
Dr. M. Solomon Raju - Member
Mrs. K. Martha - Member
Mr. B. Jason - Member
Mr. G. Leela Narayana - Member
Mr. C. Paul Pramod - Member
Mr. K. Adam - Sec., Litt.Dept.



SUBSCRIPTION CHARGES:

STUDENTS (1 Year) - Rs. 150
GRADUATES (1 Year) - Rs.300
STUDENTS (3 Year) - Rs. 400
GRADUATES (3 Year) - Rs.850
STUDENTS & GRADUATES (10 Years) Rs. 2000/-

FOR SUBSCRIPTION:

The prescribed subscription charges can be paid using the account / UPI id / QR code, fill the details in the google form (https://bit.ly/SubscriptionForVJ) and inform the same to Editor VJ through whatsapp.

**Account Name : UESI Publication Trust, Andhra Pradesh**
**Account No : 43362371247,**
**SBI Nambur Branch**
**IFSC: SBIN0011994**
**Merchant Name: UESI PUBLICATION TRUST ANDHRA PRADESH**
**UPI ID : uesiptap@sbi**



CONTACT:

The Editor
Vidyarthi Jwala,
UESI-AP - Study Centre, # 19-37,
Abhishek Nagar, Nambur - 522 508
Ph: 0863-2293319, 9299997087
Email: editorvj@gmail.com


# సిద్ధంగా ఉండు




నిత్య నాశనాన్ని ఎదుర్కోవడానికి సిద్ధంగా ఉన్న ఎంతోమంది మనుష్యులు నీ చుట్టు ప్రక్కలే ఉన్నారు. నరకాగ్ని జ్వాలల్లో యాతనపడకుండా మాకు సహాయం చేయమని వాళ్ళు నీకు మొరపెడుతున్నట్లు ఊహించుకొని వారికి సువార్తను ప్రకటించు. అలాంటి ప్రజలకు సువార్తను ప్రకటించకుండా వాళ్ళతో ఎలా జీవించగలవు? ఎలా సహవాసం చేయ గలవు? వారు ఎదుర్కోబోయే వేదనల గురించి ఆలోచిస్తే మీరు కన్నీటి పర్యంతమవ్వాలి. సాష్టాంగపడి వాళ్ళను బ్రతిమాలాలి. వాళ్ళ రక్షణ నిమిత్తం ఎలాంటి శ్రమనైనా భరించడానికి సిద్ధంగా ఉండాలి.

కుష్ఠురోగిని, దిగంబరిని, చెరసాల్లో ఉన్నవారిని, ఒంటరి వాడిని, తీవ్రమైన వేదన పడుచున్న వాడిని చూసి మీరు జాలిపడతారు. అయితే యుగయుగాలు ప్రభువు సన్నిధి నుండి దూరమై, ఆయన ఉగ్రతను అనుభవించడానికి సిద్ధంగా ఉన్న విశ్వాసిని చూసి మీరు జాలిపడరా? అలాంటి వ్యక్తిని చూసి జాలిపడని వారి హృదయం ఎలాంటిది?

– రిచర్డ్ బాక్స్టర్

## లోపలి పేజీల్లో...


- తోటివారికి చేసే గొప్ప మేలు - 2
- సిద్ధంగా ఉండు - 3
- జీవిత పరమార్థం - 4
- ప్రేషిత సేవలో పాల్గొందాం - 5
- మేరా భారత్ మహాన్ - 9
- బిడ్డలిచ్చింది... ఇందుకా తండ్రీ!! - 12
- సువార్త విలువనెరిగిన గొప్ప భక్తులు - 15
- మన బాధ్యత - 16
- సొంత పనులతో సంతసించక... - 17
- కెరీర్‌లో దేవుని చిత్తం - 20
- మిషన్స్ గురించిన అపోహలు - 23
- ఐడా సోఫియా స్కడ్డర్ - 25
- నువ్వైనా నా పని చేస్తావా? - 29
- సుఖవలయం - 32



# జీవిత పరమార్థం

దేవుని ఇష్టానికి అనుగుణంగా
నా ఇష్టాన్ని మలచుకొంటూ
అర్థమైన సత్యాన్ని
ఆచరణలోకి మార్చుకొంటూ
క్రీస్తును పోలి నేను జీవిస్తాను
ఆయనలా నేనూ జయిస్తాను!
జయించిన వారికోసం
నా ప్రభువు వచ్చినప్పుడు
మూర్తీభవించిన విజయంలా
ఆయన ముందు నిలబడతాను
అచ్చం ఆయన పోలికలో
అప్పుడు నేను కనబడతాను.

(మన సహోదరుడు తాళ్ళూరిగారి కలం నుండి జాలువారిన ఒక ఆలోచన)

“జీవించువారికమీదట తమ కొరకు కాక, తమ నిమిత్తము మృతిపొంది తిరిగి లేచినవాని కొరకే జీవించుటకు ఆయన అందరి కొరకు మృతిపొందెననియు (2 కొరింథీ 5:15) నిశ్చయించుకొన్న” పౌలు గారి మాటలు తాళ్ళూరి గారిని తప్పక ప్రభావితం చేసుంటాయి.

ఒక రోజు తిన్న ఆహారం మిగిలిన రోజులకు ఎలా శక్తిని ఇవ్వదో, ఒకనాటి సమర్పణ ప్రతిదినం మనము ప్రభువు కొరకు జీవించేందుకు ఏమాత్రం సరిపోదు. ఇంతవరకు ఎన్నో సంవత్సరాలు మనం మనకోసమే, మన ఉద్దేశాలు, ప్రణాళికలు, ఇష్టాలు, సౌకర్యాలు, ప్రాధాన్యతలు, ఎజెండాలు నెరవేర్చుకోవడానికే బతికుండవచ్చు. ఇకనైనా ఈ జీవితానికి స్వస్తి చెప్పి మన స్థానంలో మృతిపొంది తిరిగి లేచిన వాని కొరకే జీవించేందుకు కంకణం కట్టుకోవాలి. మన ప్రాధాన్యతలకు, ప్రణాళికలకు స్వస్తి చెప్పి ప్రభువు ప్రాధాన్యతలు, ప్రణాళికలు నెరవేర్చాలి. ఇందులో భాగంగా క్రీస్తు మనపట్ల చూపించిన ప్రేమనే మన విద్యార్థులకు, గ్రాడ్యుయేట్స్‌కు కనబరచాలి. ఇందులో ప్రధానమైనది, జీవించువారిక మీదట తమకొరకు కాక, తమ నిమిత్తం మృతిపొంది తిరిగి లేచిన వాని కొరకే జీవించాలి. ఆ పరివర్తన మన పరిచయస్తులలో, పరిచర్యలో, పరివారంలో ఉన్న వారందరినీ – మనల్ని పరికించి చూసే ప్రతి ఒక్కరినీ పులకరింప చేసేలా, పరవశింప చేసేలా ఉండాలి. అదే మన శేష జీవితానికి పరమార్థం కావాలని కోరుకొందాం. మనలో వచ్చిన ఈ పరివర్తన పరమ తండ్రి హృదయాన్ని తప్పక పరవశింప చేయాలి.

ఆయన ప్రణాళికలో మీ....

ఆర్. శ్రీనివాస్
యుఐయస్ఐ–ఏపి స్టేట్ సెక్రటరీ, గుంటూరు




# ప్రేషిత సేవలో పాల్గొందాం

1992వ సంవత్సరం, మే నెల, ఎర్రటి ఎండలు, యల్‌టి క్యాంప్ కడపలో జరుగుతుంది. ఒక విద్యార్థి అనంతపురం జిల్లా నుంచి వచ్చాడు. ఆ క్యాంప్‌లో అతనే అందరికంటే చిన్న వయసు వాడు. ఆ క్యాంప్‌లో ఒక మధ్యాహ్న వేళ, ఉజ్జయినీకి మిషనరీ విద్యార్థిగా వెళ్ళిన తాళ్ళూరి ప్రసాద్‌గారు తన సాక్ష్యాన్ని, తన అనుభవాలను పంచుకొన్నాడు. తన సాక్ష్యం ఆనేకమంది విద్యార్థులను ప్రభావితం చేసింది. వారిలో ఈ చిన్న వయసు విద్యార్థి కూడా ఉన్నాడు. వసంతాలు వడివడిగా వెళ్ళిపోయాయి. అప్పటి విద్యార్థి నేడు మిషనరీగా అరకులో, ఒక మిషన్ సంస్థ తరపున దేవుని సేవ చేస్తూ అనేకమందికి ఆశీర్వాదకరంగా ఉన్నాడు. మన స్టేట్ మిషన్స్ ట్రైనింగ్ క్యాంప్స్‌లో, ఫీల్డ్ విజిట్స్‌లో, మిషనరీ జీవితాలను పరిచయం చేసే పనిలో సహాయం చేస్తున్నాడు.

1999వ సంవత్సరం, నల్గొండలో ఒక ఇవాంజిలిస్టిక్ క్యాంప్ చాలా బాగా జరుగుతుంది. ఆ క్యాంప్‌కు హైందవ కుటుంబానికి చెందిన ఒక విద్యార్థి వచ్చి క్రీస్తును అంగీకరించాడు. శిష్యునిగా, నాయకునిగా ఎదిగాడు. 2000 సం॥లో హైదరాబాద్‌లో జరిగిన స్ప్రైకాన్‌లో మిషన్స్ సెమినార్‌కు హాజరయ్యాడు. అక్కడ దేవుడు అతనితో మాట్లాడాడు. దేవుని మాటకు లోబడి ఆగ్రాకు మిషనరీ స్టూడెంట్‌గా వెళ్ళాడు. తరువాత పూర్తికాలపు సేవా పిలుపు అందుకొని కాశ్మీరులో విద్యార్థుల పరిచర్యలో స్టాఫ్‌గా చేరాడు. ఇప్పుడు, మధ్యప్రదేశ్‌లో స్టేట్ సెక్రటరీగా పని చేస్తూ, అనేకమంది విద్యార్థులకు, గ్రాడ్యుయేట్స్‌కు, స్టాఫ్‌కు ఆశీర్వాదకరంగా జీవిస్తున్నాడు.

క్రైస్తవులైన తన స్నేహితులను అల్లరి చేస్తూ, మద్యపానానికి బానిసై కన్న తల్లిని సైతం కొట్టడానికి వెనుకాడని ఒక విద్యార్థి దేవుని కృపచేత ఒక గాస్పల్ ఈవినింగ్‌లో రక్షణ పొంది, శిష్యునిగా తర్ఫీదు పొంది, నాయకునిగా ఎదిగాడు. ఆ తరువాత తన జీవితం పట్ల దేవునికున్న ప్రణాళికను తెలుసుకోవడానికి 2012వ సం॥లో రంపచోడవరంలో జరుగుచున్న స్టేట్ మిషన్స్ ట్రైనింగ్ క్యాంప్‌కి వెళ్ళాడు. అక్కడ దేవుడు అతనితో స్పష్టంగా మాట్లాడాడు. 2015వ సం॥లో తన జీవితాన్ని దేవుని సేవకు సమర్పించుకొన్నాడు. కాలం వేగంగా గడిచి పోయింది. ఆ విద్యార్థి మిషనరీగా 2016 సం॥లో మాల్టోలు అనబడే జన జాతుల మధ్య జార్ఖండ్‌లో పని చేశాడు. 2018వ సం॥లో బీహార్ రాష్ట్రంలో ముసాఫర్ అనే జనజాతుల మధ్య పయనీరింగ్ మిషనరీగా వెళ్ళి ప్రస్తుతం అక్కడే ఒక మిషన్స్ సంస్థ తరపున దేవుని సేవ చేస్తున్నాడు.

ప్రతి సంవత్సరం వందలాది విశ్వాసులు తమ జీవితంలో దేవుని చిత్తాన్ని తెలుసుకొని, ఆ చిత్తానికి లోబడి తమ జీవితాలను ప్రేషిత సేవకు సమర్పిం చుకుంటున్నారు. దానికి కారణం మన పితరుల దర్శనం. యుఇయస్ఐ ఆవిర్భావ సమయంలో (1954సం॥) మనకు 3 లక్ష్యాలు మాత్రమే ఉన్నాయి. ప్రేషిత సేవ అనే 4వ లక్ష్యాన్ని 1964వ సం॥లో చేర్చారు. అప్పట్లో ఉన్న నేషనల్ ఎగ్జిక్యూటివ్ బాడీ ఈ నిర్ణయం తీసుకోవడానికి, కోయంబత్తూరులో విద్యార్థుల పరిచర్య స్థాపించడానికి కీలక పాత్ర పోషించిన డేవిడ్ సి వాట్సన్, వెల్లూరులో విద్యార్థుల పరిచర్య స్థాపించడానికి కీలక పాత్ర పోషించిన డా. జాన్ మూడి, మద్రాసులో విద్యార్థుల పరిచర్య స్థాపించడానికి కీలక పాత్ర పోషించిన డా. టి. యన్. స్టెరెట్, లోయిస్ స్టెరెట్‌ల ప్రభావం ఉండవచ్చని బ్ర. ఏ.జి. అగస్టీన్ గారు అన్నారు. అగస్టీన్ గారు విద్యార్థి గా ఉన్నప్పుడు సిస్టర్ లోయిస్ స్టెరెట్ గారు దేవుని హృదయం, ప్రపంచ మానవాళి పట్ల దేవునికున్న దర్శనం గురించి తరచూ వారికి బోధించేవారట.

మొదటి శతాబ్దంలో దేవుని ప్రేషిత ఆదేశానికి లోబడి తోమా భారత దేశానికి సువార్త ప్రకటించడానికి వచ్చాడు. ఇది చారిత్రక సత్యం. గతంలో మన ప్రధానమంత్రి ఇశ్రాయేల్ దేశ పర్యటనకు వెళ్ళినప్పుడు తోమా జ్ఞాపికను ఆ దేశ ప్రధానమంత్రి నెతన్యాహుకు బహూకరించాడు.

పంతొమ్మిదవ శతాబ్దంలో దేవుని ప్రేషిత ఆదేశానికి లోబడి మెడికల్ డాక్టరైన డేవిడ్ లివింగ్‌స్టన్ ఆఫ్రికాకు మిషనరీగా వెళ్ళాడు. ఇరవైయ్యవ శతాబ్దంలో దేవుని ప్రేషిత ఆదేశానికి లోబడి జిమ్ ఎలియట్ ఇక్వేడారుకు మిషనరీగా వెళ్ళాడు.

ఇర్వై ఒకటవ శతాబ్దంలో అలాంటి వారిని విశ్వవ్యాప్త సువార్త సేవకు అందించాలన్న ఆశయంతో, మన స్టూడెంట్స్, గ్రాడ్యుయేట్స్ దేవుని యొక్క విశ్వదర్శనం కలిగి ఉండాలన్న ఆలోచనతో మన పితరులు 4వ లక్ష్యం "ప్రేషిత సేవ"ను మనకు ఇచ్చారు. కాబట్టి ఈ సందర్భంలో 4వ లక్ష్యం అవగాహన చేసుకోవడం మన అందరి బాధ్యత. ముందుగా 4వ లక్ష్యం స్టేట్‌మెంట్‌ను చూద్దాం.

"దేవుని ప్రేషిత ఆజ్ఞ విషయమై స్టూడెంట్స్, తమ జీవితంలో దేవుని చిత్తాన్ని కనుగొని ఆయన చిత్తానికి లోబడి తామున్నచోట గాని ప్రపంచంలో మరెక్కడైనా గాని విశ్వవ్యాప్తంగా సువార్తను అందించడానికి వారికి సహాయం చేయుట."



**4 వ లక్ష్యం, "ప్రేషిత సేవ" స్టేట్‌మెంట్‌లోని 5 భాగాలను చూద్దాం**

1. **సూత్రం:** విశ్వవ్యాప్తమైన దేవుని ప్రేషిత ఆజ్ఞ
2. **పాత్రలు:** స్టూడెంట్స్, గ్రాడ్యుయేట్స్
3. **పని తీరు:** విద్యార్థులు దేవుని చిత్తాన్ని తెలుసుకొని లోబడడానికి సహాయం చేయడం
4. **స్థలం:** ఉన్న ఊరు, పొరుగు రాష్ట్రం, ఉత్తర భారత దేశం, ఇతర దేశాలు
5. **ఉద్దేశం:** ప్రపంచ సౌవార్తీకరణ

### 1. సూత్రం: విశ్వవ్యాప్తమైన దేవుని ప్రేషిత ఆజ్ఞ

దేవుని ప్రేషిత ఆజ్ఞ అంటే ఏంటో తెలుసుకొందాం. తండ్రి వద్దకు ఆరోహణమవ్వడానికి ముందు ప్రభువైన యేసు తన శిష్యులందరికి ఒక కొత్త ఆజ్ఞను ఇచ్చాడు. దీనిని మత్తయి 28:19లో, అపో. కా. 1:8లో పరిశుద్ధాత్మ దేవుడు చాలా స్పష్టంగా రాయించాడు. మీరు వెళ్ళి సమస్త జనులను శిష్యుల నుగా చేయుడి (మత్తయి 28:19). ఇదే ప్రేషిత ఆజ్ఞ. నీవు శిష్యుడవైతే/శిష్యురాలవైతే ఈ ఆజ్ఞ నీకు కూడా వర్తిస్తుంది.

ఈ ఆజ్ఞ ప్రతి విద్యార్థి, గ్రాడ్యుయేట్ హృదయంలో దూసుకుపోవాలని, ప్రతి వ్యక్తికీ అది వ్యక్తిగతంగా దేవుని ఆదేశం అవ్వాలని మన పితరులు ఆశించారు. సువార్త పరిచర్య తమిళనాడులోని విద్యార్థులకు మాత్రమే కాకుండా మధ్య, ఉత్తర భారతదేశం అంతటా జరగాలని, అలాగే విద్యార్థులకు మాత్రమే కాకుండా, ప్రేషిత ఆదేశం అనుగుణంగా సమస్త జనులకు సువార్త ప్రకటించే ప్రక్రియలో మన విద్యార్థులు, గ్రాడ్యుయేట్స్ పాత్ర కూడా ఉండాలని తలంచారు.

ఇక్కడ మనం మన మొదటి లక్ష్యం ఇవాంజిలిజంకు నాల్గవ లక్ష్యం మిషన్స్‌కు గల తేడాలను తెలుసు కోవాలి.

| మొదటి, నాల్గవ లక్ష్యాల మధ్య వ్యత్యాసం | |
|---|---|
| **సువార్తీకరణ** | **ప్రేషిత సేవ** |
| ❖ స్వంత భాష, ప్రదేశం, స్థానిక సంఘం<br>❖ స్థానిక సంఘ సభ్యుల సంఖ్య పెరుగుతుంది<br>❖ ఆధ్యాత్మిక అవసరాలు మాత్రమే తీర్చబడతాయి<br>❖ విద్యార్థుల మధ్య పరిచర్యకు ప్రాధాన్యత ఇవ్వబడుతుంది<br>❖ ఔట్‌రీచ్ చేస్తాం | ❖ మనది కాని భాష, ప్రదేశం<br>❖ నూతన సంఘాలు స్థాపించబడతాయి<br>❖ ఆధ్యాత్మిక అవసరాలతోపాటు సాంఘిక అవసరాలు కూడా తీర్చబడతాయి<br>❖ ప్రపంచ వ్యాప్త పరిచర్యకు ప్రాధాన్యత ఇవ్వబడుతుంది<br>❖ రీచ్‌ఔట్ చేస్తాం |

ఈ వ్యత్యాసం తెలిసికోకుండా కొందరు ప్రేషిత సేవ చేయాలన్న పిలుపు అందుకొన్న విద్యార్థులను, యవ్వన గ్రాడ్యుయేట్స్‌ను నిరాశపరుస్తున్నారు. ముఖ్యంగా "సువార్త చెప్పడానికి ఇక్కడ చాలా మంది స్టూడెంట్స్ లేదా కాలేజ్‌లు ఉన్నాయి. మీ తల్లిదండ్రులు మీకు ఎంతో డబ్బు ఖర్చుపెట్టి చదివించారు, నీవు ఒక్కడివే కొడుకువి/కూతురివి, వాళ్ళను వదిలేసి ఎక్కడికి వెళ్తావు" లాంటి మాటలతో వారు దేవుని చిత్తానికి లోబడకుండా అడ్డుపడుతుంటారు. ఇశ్రాయేలు దేశంలో అనేకమందికి సువార్త ప్రకటించకుండా తోమా మన దేశం ఎందుకు వచ్చాడో అర్థం చేసుకోవాలి. ప్రేషిత ఆజ్ఞకు విధేయత చూపి తోమా భారతదేశం వచ్చాడని తెలిసికోవాలి.

### 2. పాత్రలు: స్టూడెంట్స్, గ్రాడ్యుయేట్స్

స్టూడెంట్స్, గ్రాడ్యుయేట్స్ ఇద్దరూ దేవుని ప్రేషిత ఆజ్ఞను గైకొని ప్రపంచ సువార్తీకరణకు ఒక దర్శనం కలిగి ఉండడానికి సిద్ధంగా ఉండాలి. ప్రతి వ్యక్తి కూడా ప్రేషిత సేవలో తన వంతు బాధ్యతను తీసుకోవాలని దేవుడు సవాలు చేస్తున్నాడు.

### 3. పని తీరు: విద్యార్థులు దేవుని చిత్తాన్ని తెలుసుకొని లోబడడానికి సహాయం చేయడం

స్టూడెంట్స్, గ్రాడ్యుయేట్స్ తమ జీవితాల్లో దేవుని చిత్తం ఏంటో తెలుసుకోవడానికి సహాయం చేసి, వారు



ఆ చిత్తానికి లోబడే విధంగా ప్రోత్సహించమని ఈ లక్ష్యం చెబుతుంది. కాబట్టి విద్యార్థులు, గ్రాడ్యుయేట్స్ తమ జీవితం పట్ల దేవుని చిత్తాన్ని తెలుసుకోవాలి.

### 4. స్థలం: ఉన్న ఊరు, పొరుగు రాష్ట్రం, ఉత్తర భారత దేశం, ఇతర దేశాలు

"అయినను పరిశుద్ధాత్మ మీ మీదికి వచ్చునప్పుడు మీరు శక్తినొందెదరు గనుక మీరు యెరూషలేములోను, యూదయ సమరయ దేశములయందంతటను భూదిగంతములవరకును, నాకు సాక్షులైయుందురని వారితో చెప్పెను." అపో.కా. 1:8

స్టూడెంట్స్, గ్రాడ్యుయేట్స్‌గా మన మొదటి బాధ్యత పని చేస్తున్న స్థలంలో ప్రభువుకు సాక్షులుగా ఉంటూ విద్యార్థులకు అందుబాటులో ఉండడం. మనందరి ప్రస్తుత సేవా పొలం స్థానిక విద్యార్థి లోకమే. అయితే ప్రేషిత ఆదేశం ప్రకారం మన స్వంత ప్రదేశంలోనే ఆగిపోకూడదు, అంటే యెరూషలేము తరువాత, యూదయ, తరువాత సమరయ, ఆ తరువాత భూదిగంతములవరకు సాక్షులుగా ఉండాలి.

### 5. ఉద్దేశం: ప్రపంచ సౌవార్తీకరణ

దేవుడు అబ్రహాముతో ఇలా నిబంధన చేశాడు. అందులో రెండు భాగాలున్నాయి.

1. నిన్ను ఆశీర్వదించెదను (ఆది 12:2)

2. భూమియొక్క సమస్త వంశములు నీయందు ఆశీర్వదించబడును.(ఆది 12:3)

ఈ నిబంధనను మత్తయి 28:18,19 లోని ప్రేషిత ఆదేశంతో పోల్చి చూద్దాం. అబ్రహాము స్థానంలో మనల్ని పెట్టుకొందాం.

దేవుడు మనలను ఆశీర్వదించాడు (రక్షణ ఇచ్చాడు). ఇది మొదటి భాగం.

మీరు వెళ్ళి సమస్త జనులను శిష్యులనుగా చేయుడి అంటే భూమియొక్క సమస్త వంశములు మనద్వారా ఆశీర్వదించబడాలి (రక్షణ పొందాలి). ఇది రెండవ భాగం.

సమస్త జనులను శిష్యులుగా చేయాలి. ఇది శాసనం. ఇందులో వేరే గూడార్థం కానీ రహస్యం కానీ లేవు. ఇందులో ఎలాంటి రాయితీలు కూడా లేవు. ప్రతి మనుష్యుని శిష్యునిగా చేయమని ఆజ్ఞ. అంటే ప్రతివ్యక్తి దగ్గరికి సువార్త వెళ్ళాలి, ఆ వ్యక్తి శిష్యుడవ్వాలి. ఇలా ప్రతివ్యక్తి, ప్రతి జాతికి సువార్త అందాలంటే, మనం భూదిగంతాలకు వెళ్ళాలి.

భూదిగంతాలకు వెళ్ళాలంటే పిలుపు ఉండాలి. అయితే దేవుడు అందరిని పూర్తికాల సేవకు పిలవడు. కొందరికి మాత్రమే ఆ భాగ్యాన్ని ఇస్తాడు. అయితే అందరూ ప్రేషిత సేవలో పాల్గొనాలని దేవుని ఉద్దేశం. మన పితరుల ఆశయం కాబట్టి స్టూడెంట్స్, గ్రాడ్యుయేట్స్ ప్రేషిత సేవలో పాల్గొనడానికి గల అవకాశాలేంటో చూద్దాం.

ఎ. మిషన్స్‌కు సంబంధించిన సమాచారాన్ని సేకరించడం.

బి. సువార్త ప్రకటింపబడని ప్రదేశాల కోసం ప్రార్థించడం. ఉదా: ఉత్తర భారతదేశం, 10/40 విండోలో ఉన్న దేశాలు, ముస్లిమ్స్, హిందువులు,...

సి. మిషన్స్ పట్ల ఆసక్తి ఉన్న గుంపును ఏర్పరచడం (యంఐజి).

డి. మిషనరీ కుటుంబాలతో ఉత్తర ప్రత్యుత్తరాలు జరపడం, వారిని దర్శించడం.

ఇ. మిషనరీ జీవిత కథలను చదవడం.

యఫ్. మిషన్స్ పత్రికలను సేకరించడం, లేదా చందాదారులవ్వడం.

జి. మిషనరీ సంస్థలకు ఆర్థిక చేయూతనివ్వడం.

హెచ్. ఇయు మిషన్స్ రిట్రీట్‌కు లేదా మిషన్స్ ప్రార్థనా సమావేశానికి హాజరవ్వడం.

ఐ. యస్వీపి, జివిపి, యస్‌యంటిసి, షార్ట్ మిషన్ ఎక్స్‌పోజర్ ట్రిప్‌కు వెళ్ళడం.

**యస్వీపి (స్టూడెంట్ వాలంటీర్ ప్రోగ్రామ్), జివిపి (గ్రాడ్యుయేట్ వాలంటీర్ ప్రోగ్రామ్) అంటే ఏంటి?** విద్యార్థులు/ గ్రాడ్యుయేట్స్ స్వచ్ఛందంగా జీవితంలో కొంత కాలం విభిన్న సంస్కృతి గల జన జాతితో పాటు, అనుభవం కలిగిన మిషనరీతో ఉండి అక్కడ విషయాలు తెలుసుకోవడానికి నిర్దేశించబడిన కార్యక్రమం.

**షార్ట్ మిషన్స్ ఎక్స్‌పోజర్ ట్రిప్ అంటే?** విద్యార్థులు / గ్రాడ్యుయేట్స్ ఎవరైనా ఉత్తర భారత దేశంలో ఉండే ప్రాంతాల్లో పరిచర్య స్థితిగతులు తెలుసుకోవడానికి రెండు వారాల పాటు ఏర్పాటు చేసిన ట్రిప్.

ఇతర రాష్ట్రాల్లో మిషన్స్ పరిచర్య చేయాలి అనే భావన కలిగిన విద్యార్థులు, గ్రాడ్యుయేట్స్ వెళ్ళవచ్చు. అలాగే దేవుని పిలుపును నిర్ధారించుకోవడానికి, ఈ రెండు కార్యక్రమాలు ఉపయోగపడతాయి.

జె. స్టేట్ మిషనరీ ట్రైనింగ్ క్యాంప్స్‌కు హాజరవ్వడం (యస్‌యంటిసి).


కె. టెంట్‌మేకర్‌గా లేదా వొకేషనల్ మిషనరీగా వెళ్ళడం.

## ముగింపు

ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా జరుగుచున్న సంఘటనలు, పరిణామాలు యేసుక్రీస్తు రెండవ రాకడ అతి దగ్గరలో ఉందని సంకేతాలు ఇస్తున్నాయి. అది ఎంత దగ్గర పడితే అంత వేగంగా భూదిగంతాలకు సువార్త వెళ్ళాలి. కాబట్టి దేవుని ప్రేషిత ఆజ్ఞకు లోబడే వాళ్ళు కావాలి. ప్రేషిత సేవలో పాల్గొనే అవకాశం దేవుడు నీకిస్తే దాన్ని ఈ లోక సుఖభోగాల కోసం జారవిడవవద్దు. "మోషే పెద్దవాడైనప్పుడు విశ్వాసమునుబట్టి ఐగుప్తు ధనముకంటె క్రీస్తువిషయమైన నింద గొప్ప భాగ్యమని యెంచుకొన్నాడు (హెబ్రీ 11:24)".

"దేవుడు నిన్ను మిషనరీగా పిలిస్తే, రాజుగా ఉండడానికి దిగజారవద్దు" అంటాడు జోర్డాన్ గ్రూమ్స్ అనే దైవజనుడు. నీ పిలుపుకు తగినట్లుగా జీవించమంటాడు పౌలు. దేవుడు రాబోయే దినాలలో మనలను తన ప్రేషిత సేవలో బలంగా వాడుకొనును గాక ఆమెన్!

**– డా. వైవిఆర్ ప్రసన్న కుమార్,** సూర్యాపేట



# మేరా భారత్ మహాన్

'జన గణ మన అధినాయక జయహే' అనే గీతాన్ని మనం జాతీయ గీతంగా ఆలపిస్తాం. దీనిని 1911వ సం॥లో రవీంద్రనాథ్ ఠాగూర్ గారు రాశారు. ఈ పాట మన దేశంలోని రాష్ట్రాల క్లుప్త జాబితాను, అందలి విశిష్టతను, మన దేశం కలిగి ఉన్న సంపదను, సంస్కృతిని ప్రతిబింబించేలా రాసి చివరికి జయము కలుగుతూ ఉండాలని ముగించాడు.

యేసుక్రీస్తు శిష్యులుగా దేశాన్ని, సమాజాన్ని ప్రభావితం చేయడమే లక్ష్యంగా కలిగి ఉన్న మనం ఈ దేశాన్ని గూర్చి, ఆయా రాష్ట్రాలు, జాతులు, అవసరాలు, సంస్కృతులను గూర్చి తెలియకుండా ఏం చేస్తాం? ఏ సమస్యలు ఉన్నాయో తెలుసుకోకుండా వాటికి క్రీస్తే పరిష్కారమని ఎలా చెప్తాం. కాబట్టి ఇండియా సర్వే అనేది కేవలం కొంతమంది మాత్రమే తెలుసుకోవలసిన అంశం కూడా కాదు. ఇది మన అందరి బాధ్యత. భారతదేశము నా మాతృభూమి, భారతీయులందరూ నా సహోదరులు అని మనం ప్రతిజ్ఞ చేస్తాం. ఇది సత్యమే కానీ ఆ సహోదరీ, సహోదరులు ఏయే పరిస్థితుల్లో ఉంటున్నారో తెలుసుకోవాలి. ఎంతో కొంత అవగాహన ఉంటేనే కదా! వారి గురించి ప్రార్థన చేసేది. అందుకనే మన దేశాన్ని గురించి, ప్రజల గురించి తెలుసుకొందాం.

### జనాభా లెక్కలు

మన దేశంలోని జనాభాను గమనిస్తే, ప్రపంచంలోనే 1,419,316,933 మందితో మొదటి స్థానంలో ఉంది. చైనాతో పోటీ పడుతూ అప్పుడప్పుడు రెండో స్థానంలో కూడా ఉంటుంది. ఒక రోజుకు సగటున 81,746 మంది పుడుతుంటే, రోజుకు 29,679 మంది చనిపోతున్నారు. ఇక ఆయా రాష్ట్రాల జాబితా చూస్తే ఒక రాష్ట్ర జనాభా మరొక దేశ జనాభాతో సమానం. ఉత్తర ప్రదేశ్-పాకిస్తాన్‌తో, మహారాష్ట్ర-జపాన్‌తో, బీహార్-ఇథియోపియాతో, పశ్చిమ బెంగాల్-ఈజిప్ట్‌తో,మధ్యప్రదేశ్-జర్మనీతో, ఆంధ్రప్రదేశ్-టర్కీతో సమానం.

### మతాలు

భారతదేశంలో ప్రతి రాష్ట్రంలో అన్ని మతాల ప్రజలు ఉన్నప్పటికీ ఒక్కొక్క రాష్ట్రంలో ఏ మతం అధికశాతంతో ఉన్నదో చూద్దాం. హిందూ మతం-హిమాచల్ ప్రదేశ్-95.17%, ఇస్లాం-జమ్మూ కాశ్మీర్-68.31%, క్రైస్తవ్యం-నాగాలాండ్-90%, మిజోరం-87%, మేఘాలయ-70% ఈశాన్య ప్రాంతాలు, దక్షిణాన ఉన్న ప్రాంతాలు కేరళ-18%, ఆంధ్ర ప్రదేశ్, కర్ణాటక, తెలంగాణ-1 నుండి2%, గోవా-25%, అండమాన్ నికోబార్-21%, ఉత్తర భారత దేశ రాష్ట్రాలను గమనిస్తే ఏ రాష్ట్రంలో కూడా 1% కంటే లేరు. ప్రతి 1000 మందిలో కనీసం 50 మంది కూడా క్రైస్తవులు లేరు, 700 మందికి పైగా యేసు అంటే ఎవరో తెలియని వారే. అత్యధిక జనాభా ఉన్న ఈ ప్రాంతాలు అత్యల్పంగా సౌవార్తీకరించబడ్డాయి.

### మన పట్టణాలు - మన విశ్వవిద్యాలయాలు

ప్రపంచంలో ఎంతో వేగంగా అభివృద్ధి చెందుతున్న 10 దేశాల్లో మన దేశం ఒకటి. కారణం మన నగరాలు. ఢిల్లీ, ముంబై, బెంగళూరు, హైదరాబాద్, లక్నో, కోల్‌కత్త, చెన్నై, విశాఖపట్నం, ఇండోర్, గ్రేటర్ నోయిడా ఇలా చాలా నగరాలు ప్రపంచ స్థాయిలో గుర్తింపు పొందుతున్నాయి. "ది సోల్ ఆఫ్ ఇండియా లివ్స్ ఇన్ ఇట్స్ విలేజస్' అని మహాత్మా గాంధీ అన్నది వాస్తమే గాని నేడు

ప్రజలందరూ పట్టణాల వైపు మొగ్గు చూపడానికి కారణాలు అనేకం ఉన్నాయి. వాటిలో పాపం ఒకటి. పాపం పట్టణాల్లో క్రొత్తరకాల ట్రెండ్స్‌తో రూపాలు మార్చి విస్తరిస్తుంది.

2023 నాటికి భారతదేశ జనాభాలో సుమారు 36.36% మంది పట్టణ ప్రాంతాల్లో నివసిస్తున్నారు అంటే అక్షరాలా 50 కోట్ల మంది, 2030 నాటికి ఇది 40% సులువుగా చేరుతుంది. 2050 నాటికి 68% చేరుకుంటుంది. మనదేశంలో మెట్రోపాలిటన్ నగరాల్లో 1% కన్నా తక్కువ క్రైస్తవ సాక్ష్యం ఉందని చెప్పడం బాధాకరంగా ఉంది. సరిహద్దు ప్రజల సమూహాలు(యఫ్‌పిజి) వేరే దేశాలకు వలస వెళ్లే భారతీయుల జాబితా ఘనంగా పెరుగుతుంది. భూమి మీద ఉన్న ప్రజల్లో ప్రతి ఐదుగురిలో ఒకరు భారతీయులే. ఈ లెక్కల్లో ప్రతి 10 మందిలో 7 గురు భారతీయ సంతతివారే.

చాలా ప్రీమియర్ ఇన్స్టిట్యూషన్స్ లేదా టాప్‌టెన్ యూనివర్సిటీస్ ఈ నగరాల్లోనే ఉన్నాయని గుర్తించాలి. ఎఐయస్‌హెచ్ఇ ఇచ్చిన నివేదిక ప్రకారం 2019- 20 నాటికి ఒక్కొక్క నగరంలో 500 నుండి 1000 కళాశాలలు ఉన్నట్టు, లక్షల్లో విద్యార్థులు చదువుతున్నట్టు పేర్కొన్నారు. ఉదాహరణ ముంబైలో అక్షరాస్యత రేటు 89.73% (పురుషులు 92.56%, స్త్రీలు 86.39%). ప్రస్తుతం మన దేశంలో 1,213 యూనివర్సిటీలు, 58,643 హైయర్ ఎడ్యుకేషనల్ ఇన్స్టిట్యూషన్స్ ఉన్నాయి. యూనివర్సిటీలో దక్షిణాన క్రైస్తవ సాక్ష్యం ఒక మోతాదులో 10-20% ఉన్నట్టు అంచనా కానీ ఉత్తరాన 0.5% కన్నా తక్కువే.

## జాతులు - భాషలు - బైబిల్

భారతదేశంలో ప్రస్తుతానికి 2,272 జనజాతులు ఉన్నాయి. ఇందులో ఇంకా 2,041 (89.8%) మందికి సువార్త అందలేదు. ఒక్కొక్క జాతిలో 15 కోట్ల నుండి 50 వేల వరకు ప్రజలు ఉంటారు. ఉదాహరణకు నేనున్న అటవీ ప్రాంతం అరకులో 248 జన జాతులున్నారు. అందులో 238 జనజాతులకు సువార్త అందలేదు. 1,89,000 మంది ప్రజలు ఉంటే కేవలం 80 మందికి మాత్రమే సువార్త వెళ్ళింది.



మనదేశంలో రెండు కోట్లపైగా ఉన్న జనాభా గల జనజాతుల జాబితా, ఒక కోటికి పైగా ప్రజలు ఉన్న జనజాతులు 17 ఉన్నాయి. లక్షకు పైగా ప్రజలు ఉన్నవి 200, 10,000 పైగా ఉన్న జనజాతులు 1,441. ఒక్కొక్క జాతిలో కొన్ని లక్షలు కొన్ని కోట్ల ప్రజలు ఉన్నారు వీళ్ళలో ఎవరికీ యేసుక్రీస్తు గురించి పరిచయం లేదు.

1600 భాషల బహుళ సంస్కృతులు ఉన్న గర్వించదగిన ఒక అందమైన దేశం మన దేశం. మన దేశంలో 8వ షెడ్యూల్ రాజ్యాంగం ప్రకారం అధికారికంగా 22 భాషలు ఉన్నాయి కానీ అనధికారికంగా 1600 ఉన్నట్టు అంచనా. కేవలం 121 భాషలకు 19,500 మాండలికాల ను కలిగి ఉన్నది మన దేశం. దేశజాతి నిర్మాణం మీద బైబిల్ ప్రభావం గట్టిగానే ఉంది. మన దేశ భాషలకు సాహిత్యం, భాషాధ్యాయన శాస్త్రం, విద్య, ముద్రణ, పాత్రికేయం మొదలగు వాటిపై క్రైస్తవ మిషనరీల ప్రయాస, వారి ప్రభావం గట్టిగానే ఉంది. ఏ భాష పై ఎవరు పనిచేశారు, సాహిత్య రంగంలో క్రైస్తవుల పాత్ర ఖచ్చితంగా మనం తెల ుసుకోవాలి. డాక్టర్ బాబు కె వర్గీస్ గారు రాసిన "లె ట్ దేర్ బి ఇండియా"అనే పుస్తకం చదవాలని నా విన్నపం. పూర్తి బైబిల్ 74 భాషల్లో, క్రొత్త నిబంధన 92 భాషల్లో, లేఖనాల్లో కొన్ని భాగాలు 48 భాషల్లో, బ్రెయిలీ ఎడిషన్ 15 భారతీయ భాషల్లో ఉన్నాయి. 80% భాషల్లో బైబిల్లోని భాగాల్లో ఒకటి కూడా అందుబాటులో లేదు. ప్రస్తుతం కొనసాగుతున్న అనువాదాలు 110 భాషలు. వీటిపై పనిచేస్తున్న సంస్థలు బియస్ఐ, ఐబిటి, ఐఇయం, ఐయంయస్, యఫ్‌యంపిబి మొ॥ ఉన్నాయి.

## మిషనరీలు - నిధులు

భారతదేశాన్ని చేరుకోవడానికి ఏకైక మార్గం ఉద్యమాలు అని అంటాడు రిక్‌వుడ్. మన యుఇయస్ఐ కూడా ఒక ఉద్యమం అని మనం గుర్తుపెట్టుకోవాలి. మన దేశంలో నేటికి 110కి పైనే ఇవాంజిలికల్ సంస్థలు సంఘుస్థాపనే లక్ష్యంగా పనిచేస్తున్నాయి. యన్‌జివో సంస్థలు 1600, 100కి పైగా బైబిల్ కాలేజీలు, వెయ్యికి పైగా బైబిల్ స్కూల్స్ ఉన్నాయి. ప్రతి 10 లక్షల మందికి ఏడుగురు మిషనరీలు ఉన్నారు. ఇది ఎంతో బాధాకరం. 75% మంది 90% క్రైస్తవ్యం వ్యాపించి ఉన్న ఈశాన్య,

దక్షిణ భారతదేశంలో పనిచేసేవారే. ఈ దినాల్లో మిషనరీస్ అనగానే మనకు వచ్చే చిత్రం కొండలు పల్లెలు అది నిజమే కానీ ఇప్పుడు నగరాల్లో పని చేయాల్సిన అవసరత ఎక్కువగా ఉంది.

నిధుల విషయానికొస్తే భారతదేశంలో క్రైస్తవుల నుండి వస్తున్న నిధులు వంద రూపాయలు అనుకుంటే అందులో తొంభై రూపాయలు మెగా చర్చ్‌లకు, దక్షిణ దేశంలోని కాపరులకు వెళ్తున్నాయి. మిగిలిన 10%లో 9% మిషనరీ సంస్థలకు, ఒక్క రూపాయి అత్యవసర మిషనరీలకు అందుతుంది. ఎంత శోచనీయం. ఒక్క రూపాయితో ఆ మిషనరీ ఏ పని చేయగలడు? అవసరత ఎక్కడ ఉందో గమనిద్దాం.

## క్రైస్తవ వ్యతిరేకత

క్రైస్తవులపై హింస అనే అంశంలో వరల్డ్ వాచ్ లిస్టు ప్రకారం ఇండియా ప్రపంచంలోనే 11వ స్థానంలో ఉంది. ఇండియాలో అత్యధికంగా హింస జరుగుతున్న 50 ప్రమాదకర ప్రాంతాలను వారు గుర్తించారు. కొన్ని క్రైస్తవ వ్యతిరేక సంస్థలు వాట్సాప్ గ్రూప్స్ ద్వారా ఒక ఉద్యమాన్ని నడుపుతున్నారు. పల్లెల్లో, గ్రామాల్లో, అడవి ప్రాంతాల్లో వివక్ష ద్వారా ఘర్‌వాపసీ అనే కార్యక్రమాన్ని చేపట్టారు. క్రీస్తుని నమ్మిన కుటుంబాల్లో ఎవరైనా ఒక వ్యక్తి చనిపోతే అది వెంటనే ఆ గ్రూపులో పోస్ట్ చేస్తారు. కేవలం 30 నిమిషాల్లో అక్కడికి ఆ గుంపులు వచ్చి ఆ గ్రామ పెద్దలతో కలిసి ఆ కుటుంబం ఘర్‌వాపసీకి అంగీకరిస్తే తప్ప ఆ శవాన్ని సమాధి చేయనివ్వరు.

## మన బాధ్యత

### ప్రార్థిద్దాం

2 దిన వృత్తాంతములు 7:14 ప్రకారం నీవు చేసిన ప్రార్థన విని దేశాన్ని కాపాడుతాను అని దేవుడు వాగ్దానం చేశాడు కదా! ఒక్కరు కాదు దేశంలో ఏడు కోట్ల 11 లక్షల 20వేల మంది క్రైస్తవులు ఉన్నారు. వారంతా ప్రార్థన చేస్తే వినడానికి ఆయన సిద్ధంగా ఉన్నాడు. రండి మన దేశం కోసం కలిసి మొరపెడదాం. ఉపవాస దినాల ప్రకటన చేద్దాం. ఈ క్రింది అంశాల కోసం ప్రార్థిద్దాం.

1. పట్టణాల్లో జీవిస్తున్న అత్యధిక జనాభా ఉన్న ప్రాంతాల్లో క్రైస్తవ సాక్ష్యాన్ని లేవనెత్తే విధంగా ప్రార్థిద్దాం, దేవుడు ఆ ప్రాంతాలకు వెళ్ళమంటే వెళదాం. విద్యార్థులను, గ్రాడ్యుయేట్స్‌ను ఆ స్థాయికి సిద్ధం చేయాలి.
2. ఒక్కసారి కూడా సువార్త వినని జనజాతులు మన దేశంలో ఏమేమి ఉన్నాయో గుర్తించి వారి కొరకు ప్రార్థించడం.
3. అసంపూర్తిగా ఉన్న ఆ 110 భాషల్లో బైబిల్ అనువాదం పూర్తయ్యేటట్లు, వాటిపై పనిచేస్తున్న సంస్థలకు ఆర్థికంగా సహాయపడడం.
4. ఎఐయస్‌హెచ్ఇ సర్వే ప్రకారం మన దేశంలో ఇంటర్నెట్ యాక్టివ్ యూజర్లు 80 కోట్ల మంది. 9 నుంచి 17 సంవత్సరాల వయసు వారు 3 గంటలకు పైగా గేమ్స్ ఆడుతున్నారు. 72% కన్నా ఎక్కువ మంది రోజుకి ఒక గంట ఆన్లైన్లోనే ఉంటున్నారు. 80% యూత్ పోర్నోగ్రఫీకి ఎడిక్ట్ అయ్యి ఉన్నారు.

### దేవుని పరిచర్యకు ఇద్దాం

ఒక ట్రైకాన్, రెగ్‌కాన్‌ల కొరకు లక్షల్లో ఖర్చు పెట్టగల స్థితి దేవుడు మనకు ఇచ్చాడు. అదే సమయంలో మన పక్క రాష్ట్రాల అవసరతల ను కూడా చూద్దాం. మన దగ్గర నుంచే వెళ్తున్న టెంట్ మేకర్స్, మిషనరీ స్టూడెంట్స్, కోఆర్డినేటర్స్ మిషనరీలకు సహాయంగా మనం ఉందాం. ఆర్థికంగా సహాయపడదాం. త్యాగపూరితంగా పరిచర్యకు ఇద్దాం.

### వెళదాం

'వెళ్ళు లేదా వెళ్ళే వారిని పంపు' అనే నినాదంతో పరిచర్య లేని ప్రాంతాలకు, ట్రాన్స్ఫర్ వచ్చినప్పుడు ప్రార్థన చేసి దేవుడు ఎక్కడికి వెళ్ళమంటే అక్కడికి వెళ్దాం. ఎవరూ వెళ్ళలేని ప్రాంతాలను ఎంపిక చేసుకుందాం. దేశ నలుమూలలకు వెళ్దాం. ప్రైవేట్ జాబ్స్ అయితే అవసరం ఉన్న ప్రాంతాలను గుర్తిద్దాం. మిషన్స్ డిపార్ట్మెంట్ వారు ఇచ్చే 65 నగరాల జాబితాను ముందు పెట్టి ప్రార్థన చేద్దాం. ప్రార్థిద్దాం పంపిద్దాం, వెళదాం.

భారత దేశానికి సువార్తను, సువార్తికులను అందించే విషయంలో మనందరికీ క్రీస్తు నామంలో విజయం కలుగును గాక! జయహే జయహే జయ జయ జయజయహే.

– **వి. కిషోర్ బాబు,** స్టాఫ్, నర్సీపట్నం



# బిడ్డలనిచ్చింది.. ఇందుకా తండ్రీ!!

తమ పిల్లలు పూర్తికాలం దేవుని సేవ చేస్తామంటే ఏ తల్లిదండ్రులైనా త్వరగా అంగీకరిస్తారా? అంత త్వరగా అంగీకరించరు! ఎందుకంటే వారికి తమ పిల్లల బంగారు భవిష్యత్‌ను గూర్చి ఎన్నో కలలు ఉంటాయి. చూస్తూ చూస్తూ కష్టాలు, సమస్యలు, ఆర్థిక ఇబ్బందుల్లోకి వెళ్ళడానికి ఎవరూ ఇష్టపడరు. ప్రస్తుత పరిచర్యలో ఉన్న పరిస్థితులను బట్టి అనేక భయాలు వారిని చుట్టుముడతాయి. మరీ వారు అడిగితే, ఏదైనా ఉద్యోగం చేసుకొంటూ పరిచర్య చేయమని ప్రోత్సహించే తల్లిదండ్రులే ఎక్కువగా ఉంటారు.

పశ్చిమ గోదావరి జిల్లా, జంగారెడ్డి గూడెంకు చెందిన యస్ దేవిడ్ లివింగ్ స్టోన్, రత్నకుమారి గార్లకు ముగ్గురు పిల్లలు. ప్రారంభం నుండే పిల్లల్ని దేవుని భయంలో పెంచారు. వారి పెద్ద కుమార్తె, కుమారుడు దేవుని పిలుపుకు లోబడి సంపూర్ణ సేవకు వెళతామన్నప్పుడు అనేక భయాలున్నా, వారి పట్ల దేవుని సంకల్పాల్ని గుర్తిస్తూ, ఎలా ప్రోత్సహించారో వారి మాటల్లోనే తెలుసుకొందాం.

* * *

### తొలి సంతానం - నిస్సీ లివింగ్ హోప్

బి.టెక్. పూర్తి చేసిన తర్వాత బ్యాంక్ కోచింగ్‌కు పంపించాము. అనంతరం పాల్ జాషువాతో వివాహమైంది. ఒకరోజు కుటుంబ ప్రార్థన అనంతరం " దేవుడు మమ్ములను సంపూర్ణ సేవకు పిలుస్తున్నాడు" అని ఇరువురు మాతో షేర్ చేశారు. ఒక ప్రక్క కుమారుని సంపూర్ణ సేవకు సమర్పించుకున్నాము, ఇప్పుడు వీరు కూడా సంపూర్ణ సేవ అంటున్నారు. ఎలా బ్రతుకుతారా అని ఒకింత ఖంగు తిన్నాము. అప్పుడు దేవుడు మాకు గతాన్ని గుర్తు చేశాడు. గతంలోకి వెళితే... బిడ్డ జీవితంలో మూడు అనుభవాలు.

అది 1992 ఏప్రిల్ 19. ప్రభువు పునరుత్థానుడైన ఈస్టర్ రోజు. తొలి సంతానం డెలివరీ కొరకు నా భార్య రత్నకుమారిని హాస్పటల్లో జాయిన్ చేశాము. సిజేరియన్ చేయగా పాప పుట్టింది. శరీరం నీలిరంగులో ఉంది. పాప తల్లి కడుపులో ఉమ్మనీరు తాగిందని, ఆక్సిజన్ అందక తీవ్ర ఇబ్బంది పడిందని డాక్టర్స్ చెప్పారు. ఇంక్యుబేటర్‌లో పెట్టి వైద్యం అందించగా ప్రాణాపాయం నుండి దేవుడు బిడ్డని రక్షించారు.

ఆరోజు ఉదయం నా క్వైట్‌టైమ్ నిర్గమ 17:8-16. ఇశ్రాయేలీయులకు, అమాలేకీయులకు మధ్య యుద్ధం జరుగుతుంది. అది ఇశ్రాయేలీయులకు జీవన్మరణ సమస్య. ఎట్టకేలకు దేవుడు ఇశ్రాయేలీయులకు అమాలేకీయుల పైన విజయాన్ని అనుగ్రహిస్తాడు. మోషే ఆ స్థలానికి 'యెహోవా నిస్సీ' అని పేరు పెడతాడు. నిస్సీ అనగా ధ్వజము. ధ్వజము విజయానికి సూచన. ప్రభువు కూడా రెండు రోజులుగా సమాధిలో మృత్యువుతో పోరాడి దాన్ని జయించి మూడవ రోజున పునరుత్థానుడై తిరిగి లేస్తాడు. అదే ఈస్టర్ రోజు. పాప కూడా తల్లి కడుపులో మృత్యువుతో పోరాడుతూ వచ్చింది. దేవుడు తన మహా కృప చేత బిడ్డను సజీవంగా ఇచ్చాడు. అందుకనే "నిస్సీ లివింగ్ హోప్" అని పేరు పెట్టాము.

అది 1992 సంవత్సరాంతం గుంటూరు ఆంధ్ర క్రిస్టియన్ కాలేజీలో ట్రైకాన్ జరుగుతుంది. నిస్సీకి ఎనిమిది నెలల వయసు. ప్రకాష్ యేసుడియన్ గారు డివోషన్స్ తీసుకుంటున్నారు. అనువాదం మొండితోక సుధాకర్ గారు. సువార్త చెప్పడానికి ప్రజలు (విద్యార్థులు) దొరకడం లేదు అనే తప్పుడు భావనతో మనం ఉంటుంటామంటూ, ఒకరోజు డివోషన్లో దైవజనుడు ఇలా సవాలు చేశారు. "మీరు రోడ్డు మీదకు వెళ్ళి కళ్ళు మూసుకొని తల, వేలు పైకెత్తి రెండు నిమిషాల తర్వాత కళ్ళు తెరిచి చూడండి మీ చుట్టూ జనం పోగై ఉంటారు. 'అదే భారతదేశం. మీరెక్కడికి వెళ్ళినా అక్కడ ప్రజలుంటారు' అని అన్నారాయన. సుధాకర్ గారి నోట మాటలు పెగలడం లేదు. ఏడుస్తున్నారు. మీటింగ్ హాల్లో చాలామంది బోరున ఏడుస్తున్నారు. ఆ తాకిడి నాకూ తగిలింది. నేనూ ఏడుస్తున్నాను. దు:ఖం ఆపుకోలేక పాపను ఎత్తుకొని బయటకు వెళ్ళి "తండ్రీ మేము మీ సేవకు పునరంకితమవుతున్నాము. ఈ బిడ్డను కూడా నీకు అప్పగించుకుంటున్నాను. నీవే చూసుకో. ఈ బిడ్డ నీ సేవ చేయాలి" అని బిగ్గరగా ప్రార్థించాను. బిడ్డను గుండెకు హత్తుకుని "అమ్మా నీవు దేవుని కొరకు బతకాలి. ఆయన సేవ చేయాలి" అని బిడ్డతో చెప్పాను. ఆ మాటలు 8 నెలల పాపాయికి అర్థం కావు. ఆరోజు పరిశుద్ధాత్మ దేవుడు నాతోపాటు అనేక మందిని తాకాడు.

ఒకసారి మా గ్రామంలో సంఘ సువార్త కూడికలు జరిగాయి. ఆచార్య ఆర్ఆర్కే మూర్తి గారు స్పీకర్. ఆయనకు మా ఇంటిలో విడిది. అప్పుడు నిస్సీ వయసు సంవత్సరం. ఆయన పాప తల మీద చేతులుంచి "ప్రభువా ఈ బిడ్డ అనేకులకు ఆశీర్వాదకరంగా నీ కొరకు బ్రతుకునట్లు దీవించండి" అని ప్రార్థన చేశారు.

దేవుడు ఈ అనుభవాల గుండా మమ్మల్ని తీసుకువెళ్ళాడు గానీ అది అక్షరాల జరుగుతుందని ఊహించలేదు. భార్యాభర్తలిద్దరూ సంపూర్ణ సేవకు తమను నడిపిస్తున్న విధానాన్ని మాతో షేర్ చేసిన అనంతరం ఆయన మాకు గత అనుభవాలను జ్ఞాపకం చేసి మమ్ములను సంతృప్తి పరిచాడు. పాల్ జాషువా తన ఉద్యోగానికి రాజీనామా చేశాడు. ఇప్పుడు యుఇయస్ఐ-ఏపిలో స్టాఫ్ ఫ్యామిలీగా విజయవాడను బేస్ చేసుకొని విద్యార్థి పరిచర్య చేస్తున్నారు.

"ప్రతి తొలిచూలు పిల్లను నాకు ప్రతిష్టించుము" (నిర్గమ 13:2) అనే ఆయన ఆజ్ఞను మా తొలి చూలు బిడ్డ విషయంలో నెరవేర్చుకున్నందుకు మేము ఎల్లప్పుడూ దేవునికి కృతజ్ఞులం.

## మూడవ సంతానం - డేవిడ్ లవింగ్ సన్

'ఎక్కువ సంతానాన్ని కనడం ఏ విధంగానూ మంచిది కాదు కాబట్టి ఇద్దరినే కనాలి. ఆడపిల్ల, మగపిల్ల ఒక్కటే. ఆడపిల్ల పట్ల వివక్ష చూపకూడదు' వంటి కొన్ని ఆదర్శాలు నాకు ఉండేవి. మగ బిడ్డను ఇవ్వు అని నేను ఎప్పుడూ దేవుని ప్రార్థించలేదు. అవి తొలి కాన్పుకు ముందు రోజులు. ఒక రోజు నేను నా క్వైట్టైమ్ చేసుకుంటున్న సమయంలో ఆదికాండం 15వ అధ్యాయం ద్వారా దేవుడు నాతో మాట్లాడాడు "నీ గర్భవాసమున పుట్టబోవుచున్నవాడు నీకు వారసుడు" అనే మాటలు నాతోనే చెప్తున్నారు అనే భావన కలిగింది. మరొకసారి 17వ అధ్యాయం ఆరంభవచనాల ద్వారా కూడా నాతోనే మాట్లాడుతున్నట్లు అనిపించింది. మొదటి సంతానం డెలివరీ రోజున కూడా మూడవసారి 18వ అధ్యాయం 10, 14 వచనాల ద్వారా మాట్లాడి రూఢి పరిచాడు. అయితే మొదటి సంతానంగా పాప పుట్టింది.

రెండవ సంతానం డెలివరీ సమయంలో జరిగిన అనుభవం. ఆడపిల్ల అయినా మగపిల్ల అయినా రెండవ డెలివరీ తర్వాత ఫ్యామిలీ ప్లానింగ్ ఆపరేషన్ చేయమని డాక్టర్ గారికి గట్టిగా చెప్పాము. డెలివరీ టైమ్లో అధిక రక్తస్రావం మూలంగా తల్లి కోమాలోకి వెళ్ళిపోయే ప్రమాదం ఉందని గ్రహించిన డాక్టర్ ట్యూబెక్టమీ చేయలేదు. సిజేరియన్ మాత్రమే చేసి బిడ్డను తీశారు. అది 1994 నవంబర్ 8. రెండవ సంతానం కూడా ఆడపిల్ల పుట్టింది. ఆ బిడ్డకు "జెస్సీ లివింగ్ ఫెయిత్" అనే పేరు పెట్టాము.

దేవుడు గతంలో మగ బిడ్డను గురించి మాట్లాడిన మాటలను తప్పుగా అన్వయించుకున్నాననే నిర్ధారణకు వచ్చి ఇక ఆ ఆలోచనే పక్కన పెట్టేశాము. ఫ్యామిలీ ప్లానింగ్ ఆపరేషన్ చేయించుకోవడానికి నేను అనేక ప్రయత్నాలు చేశాను. అన్నీ విఫలమయ్యాయి. ఈలోగా నా భార్య మూడవసారి గర్భం ధరించింది. "నా భార్యకు ప్రమాదం, పైగా ఇద్దరి కంటే ఎక్కువ మందిని మేము పెంచలేము. వారి అన్ని అవసరాలు తీర్చి అభివృద్ధిలోకి తీసుకురాలేము, దయచేసి మీరే



**ఇద్దరు బిడ్డలను ఆయన సేవలో, ఒక బిడ్డను రోగుల సేవలో నియమించుకోవడం ఆయనకు ఇష్టమైంది. బిడ్డలనిచ్చింది ఇందుకని ఎరిగాక ఆయనను స్తుతించకుండా ఎలా ఉండగలం!**

దీనిని తొలగించండి దేవా" అని ప్రతిరోజు దేవునిని గోజాడి ప్రార్థించే వాడిని. 8 నెలలు గడిచిపోయాయి. ఒక డాక్టర్ "తల్లికి ప్రమాదం, మూడవది కూడా సిజేరియన్ అవుతుంది, రెండవ దానికి మూడవ దానికి ఎక్కువ వ్యవధి లేదు, బిడ్డ ఏమో కానీ తల్లి ప్రాణాలు కాపాడుకోండి. నెల రోజులు ముందే హాస్పిటల్‌లో జాయిన్ అయ్యి మా పర్యవేక్షణలో ఉంచండి" అని చెప్పారు.

భయము, దు:ఖము మమ్ములను ఆవహించాయి. ఆరోజు నా క్వైట్‌టైమ్ యెషయా 66వ అధ్యాయం ద్వారా దేవుడు మాట్లాడాడు ".....నొప్పులు తగలక మునుపే మగ పిల్లను కనినది (వ7).... నేను ప్రసవ వేదన కలుగజేసి కనిపింపకమానెదనా?... పుట్టించువాడనైన నేను కనిపింపకమానెదనా?... పుట్టించువాడనైన నేను గర్భమును మూసెదనా? (వ9).. ఆమెను బట్టి దు:ఖించు వారలారా మీరందరూ ఆమెతో సంతోషించుడి (వ10)" అని దేవుడు నాతో మాట్లాడాడు.

గతంలో ఆయన వాక్యాన్ని తప్పుగా అన్వయించుకున్నాను కదా ఇది కూడా అలాంటిదేనేమో అనుకున్నాను.

అత్యవసర కారణాన 1996 మార్చి 21న మరో డాక్టర్‌ను సంప్రదించాము. ఆయన పరీక్షించి 22న జాయిన్ అవ్వండి అని చెప్పారు. నా భార్య "22న మా పెళ్ళి రోజు, అదే నా ఆఖరి సెలబ్రేషన్" అని మనసులో అనుకొని 23న జాయిన్ అయ్యింది. 24న సిజేరియన్ చేసి బిడ్డను తీశారు. దేవుడు మాట ఇచ్చినట్లు అది మగపిల్లవాడు. నా భార్య దాదాపు మృత్యురేఖ దాకా వెళ్ళి తిరిగి వచ్చింది. అది దేవుని మహా కృప.

తొలి సంతానం సమయంలో దేవుడిచ్చిన వాగ్దానాన్ని నాలుగు సంవత్సరాల అనంతరం నెరవేర్చాడు. అడగకుండా దేవుడే పని కట్టుకొని ఇచ్చినందుకు, బిడ్డను ఆయన సేవకే సమర్పించుకున్నాము.

ఇంకా స్కూల్లో చేర్చకముందు ఇంట్లో డేవిడ్, గొల్యాతు కథ విని నా పేరు డేవిడ్ అన్నాడు. దానికి మేము 'లవింగ్‌సన్' అని చేర్చాము. బాల్యం నుండి తన పట్ల దేవుని సంకల్పాన్ని తెలియపరుస్తూ వచ్చాము. అది 2014. ఒక సాయంత్రం స్కూలు నుండి వస్తూ 'నీవు చేసిన ఉపకారములకు నేనేమి చెల్లింతును..' అనే పాటను ఆలాపన చేస్తున్నాను. 'గర్భఫలమైన నా జ్యేష్ఠ పుత్రుని నీకిచ్చినా చాలు నా?' అనేచోటకు వచ్చేటప్పటికి నా హృదయాన్ని ఎవరో బలంగా తాకినట్లయింది. నా గుండెల్లో నుండి కృతజ్ఞతావర్షం నా కళ్ళల్లో కమ్ముకుంది. దారి కనబడడం లేదు. బైక్‌ను మెల్లగా ప్రక్కకు తీసి ఆ అనుభవం పూర్తి అయ్యేదాకా ఆగి ఇంటికి చేరాను. అది ముమ్మాటికీ పరిశుద్ధాత్మ తాకిడి అని రూఢిగా ఎరుగుదును.

డేవిడ్ యంఏ, ఇంగ్లీష్ చేసి, ఒక డిగ్రీ కాలేజ్‌లో ఫ్యాకల్టీగా చేశాడు. తన పట్ల దేవుని సంకల్పాన్ని స్వయంగా గ్రహించి, ఆ జాబ్‌కు రిజైన్ చేసి, పూణేలోని యుబియస్‌లో బిడి చేశాడు. బిడి పూర్తయ్యాక దేవుని నడిపింపును బట్టి తెలంగాణలో స్టాఫ్ కోర్డినేటర్‌గా జాయిన్ అయ్యాడు. దేవుని చిత్త ప్రకారం 2025లో తిరుపతిలో స్టాఫ్ కోర్డినేటర్‌గా చేస్తున్న రేచల్ ప్రబితతో వివాహం జరిగింది. ప్రస్తుతం వారు కుటుంబంగా తెలంగాణాలోని భూపాలపల్లిలో విద్యార్థి పరిచర్య చేస్తున్నారు.

"నీ కుమారులలో తొలిచూలుయైన ప్రతి మగపిల్ల నాది" (నిర్గమ13:13) అనే ఆయన మాటను మా బిడ్డ విషయంలో జరిగించుకున్నందుకు దేవునికి మేమెంతో కృతజ్ఞులం.

## రెండవ సంతానం - జెస్సీ లివింగ్ ఫెయిత్

తను చదువుల్లో ఇంకా బాగా రాణించేది. లక్షలు ఖర్చు పెట్టి డాక్టర్‌ను చదివించే ఆర్థిక స్తోమత లేక కనీసం అగ్రికల్చర్ బీయస్సీ అయినా చదివిద్దాం అని ఒక కాలేజీలో బైపిసి గ్రూపులో చేర్పించాము. మంచి స్కోర్‌తో పాస్ అయ్యింది. యంసెట్‌లో మంచి ర్యాంక్ వచ్చింది. యంబిబియస్ సీట్ వస్తుందేమోనన్న

ఒకింత ఆశ పుట్టింది. బిడ్డ ఉపవాసం ఉండి ప్రార్థన చేస్తూ వచ్చింది. తనతో దేవుడు వాగ్దానం చేస్తున్న వైనాన్ని మాతో షేర్ చేసింది. 2011 మేలో ఒకరోజు రోమా 8:18-30 (28) ద్వారా నాతో మాట్లాడాడు. జులై నెలలో మరొక రోజు 2 దినవృత్తాంతాలు 15:7 ద్వారా మాట్లాడాడు. మరో రోజు లూకా 8:40-56 ద్వారా మాట్లాడి "వేచి ఉండమని" చెప్పాడు. జులై 23న యెషయా 61 ద్వారా, 24న కీర్తన 147 ద్వారా దేవుడు మాట్లాడుతూ అభయమిస్తున్నాడు. కౌన్సిలింగ్ రోజు గవర్నమెంట్ కాలేజీలో ఉన్న ఆఖరి ఒక్క సీటు దేవుడు అద్భుతంగా బిడ్డకు మొదటి ప్రయత్నంలోనే అనుగ్రహించాడు. యంబిబియస్ పూర్తయిన కొంత కాలం తర్వాత లా కాలేజ్‌లో ఫ్యాకల్టీగా పని చేస్తున్న సంఘ విశ్వాసి కిరణ్‌తో వివాహం అయింది. తదుపరి నెలలో గవర్నమెంట్ హాస్పటల్‌లో మెడికల్ ఆఫీసర్‌గా దేవుడు ఉద్యోగాన్ని ఇచ్చాడు. ఇప్పుడు బిడ్డను మరొక స్థాయికి హెచ్చించాడు. జనరల్ సర్జరీ విభాగంలో పీజీలో సీటును అనుగ్రహించాడు.

"ఇంతగా హెచ్చించుటకు నేను ఎంతటి వాడను? నా కుటుంబం ఏ పాటిది? అని 2 సమూ 7:18లో దావీదు పలికిన మాటలు మా కుటుంబానికి అక్షరాల వర్తిస్తాయి.

## ముగింపు

మొదట ఆయన నీతిని రాజ్యాన్ని వెదకాల నేది మా ఒప్పుదల. యోబు తన బిడ్డల కొరకు ప్రార్థించినట్లుగా మా బిడ్డలు దేవునికి దూరమై భ్రష్టులైపోకూడదని వారు నిద్రిస్తుండగా వారి తలల పై చేతులుంచి కన్నీటితో ప్రార్థించే వారము. కీర్తన 115:13,14 లోని వాగ్దానాలతో పాటు అనుదిన వాక్య ధ్యానాల ద్వారా దేవుడు మాకు ఇచ్చిన వాగ్దానాలు అనేకం. ఆయా సందర్భాలలో ఆయనకు ఆయాసం తెప్పించినప్పుడు క్షమించి అక్కున చేర్చుకున్న దేవునికి మేమెంతో రుణపడి ఉన్నాము.

మన బిడ్డలకు మనం గృహనిర్వాహకులమే గాని యజమానులం కాదు. దేవుడే యజమాని.

ఇద్దరు బిడ్డలను ఆయన సేవలో, ఒక బిడ్డను రోగుల సేవలో నియమించుకోవడం ఆయనకు ఇష్టమైంది. బిడ్డలనిచ్చింది ఇందుకని ఎరిగాక ఆయనను స్తుతించకుండా ఎలా ఉండగలం!

**– యస్‌డి లివింగ్‌స్టోన్, రత్న కుమారి,** జంగారెడ్డిగూడెం


## FORM IV

Statement about ownership and other particulars about newspaper / Magazine Vidyardhi Jwala.

| | | | |
|---|---|---|---|
| 1. | Place of publication | : | Abhisheka Nagar, Nambur – 522508, Guntur |
| 2. | Periodicity of its publication | : | Monthly |
| 3. | Printer's Name | : | P. Basavaiah, Bhashyam Publishers |
| | Nationality | : | Indian |
| | Address | : | Amaravathi Road, Guntur 522 007 |
| 4. | Publisher's Name | : | B J Lazarus |
| | Nationality | : | Indian |
| | Address | : | UESI-AP, Abhisheka Nagar, Nambur – 522508 |
| 5. | Editor's Name | : | B J Lazarus |
| | Nationality | : | Indian |
| | Address | : | UESI-AP, Abhisheka Nagar, Nambur – 522508 |

6. Names and addresses of individuals who own the newspaper and partners or share-holders holding More than one per cent of the total capital.

Union of Evangelical Students of India
Abhisheka Nagar, Nambur – 522508

I, B J Lazarus hereby declare that the particulars given above are true to the best of my knowledge and belief.

BJ Lazarus
Signature of Publisher

Date: 01-03-2025

బైబిల్ స్టడీ

# మన బాధ్యత

## (100వ కీర్తన)

ఈ కీర్తనను ప్రవచనాత్మక ప్రకటనగా పరిగణించవచ్చు. ఈ కీర్తన దావీదు మహారాజు బిసి 1400-538 మధ్యలో రాశాడు. ఆ రోజుల్లో దేవుడిని ఆరాధించడం అనేది కేవలం ఇశ్రాయేలు జనాంగం మాత్రమే చేసేవారు. కీర్తనాకారుడు ఈ కీర్తన ద్వారా భూమి మీద ఉన్న సమస్త దేశాల జనులను దేవుణ్ణి స్తుతించమని, ఆరాధించి ఆయనలో సంతోషించమని చెప్తున్నాడు. మానవాళి అంతా ఆయనను నిజమైన దేవుడిగా గుర్తించి,ఆయనను ఇష్టపూర్వకంగా ఆరాధించాలని కీర్తనాకారుడు కోరుకుంటున్నాడు. ప్రజలందరు ఆయన సన్నిధికి రావాలని, సృష్టికర్త ఆయనే అని, తప్పిపోయిన గొర్రెల్లాంటి మనల్ని కాస్తూ మంచి ఈవులతో మనల్ని మేపేకాపరి ఆయనే గనుక మానవాళి అంతా ఆయనకు కృతజ్ఞతా స్తుతులు చెల్లించాలని కోరుకుంటున్నాడు. సమస్త జనులు ఆయనను ఆరాధిస్తూ, అందరూ ఆయన పరిశుద్ధ ఆవరణలో ఉండాలని కోరుకుంటున్నాడు. ఆయన దయ, కృప మానవాళి అందరిపట్ల నిత్యము, తరతరాలు ఉంటుంది అని చెప్తున్నాడు.

### ప్రశ్నలు

1. ఈ కీర్తనలో దేవుని యొక్క ఏయే లక్షణాలు చూడగలము?
2. కీర్తనాకారుడు సమస్త జనులను ఏమి చేయమంటున్నాడు?
3. కీర్తనాకారుడు చెప్తున్న విషయాలన్నిటిని ఎవరు చేయగలరు? వాటిని చేయలేక పోవడానికి కారణాలు ఏంటి?
4. మనము ఆయన వారము, ఆయన గొర్రెలము అనడంలో దేవుని, కీర్తన కారుడి ఉద్దేశం ఏమై ఉండవచ్చు?
5. సమస్త దేశములను పిలుచుటలో యేసు చివరి ఆజ్ఞ గుర్తొస్తుందా? ఎలా? (మత్తయి 28:19,మార్కు 16:15, అ.కా 1:8)



6. ఎందుకు సమస్త జనులు ఆయనను ఘనపరచాలని కోరుకుంటున్నాడు?
7. సమస్త ప్రజలకు ఆయనే దేవుడు అని తెలియకపోతే ఏమి జరుగుతుంది?
8. వారు నిజమైన దేవుడిని తెలుసుకోలేక పోవడానికి మనమెలా కారణం అవుతాము?
9. సంతోషంగా ప్రజలందరూ దేవుని సేవించాలి అంటే మనం ఏమి చేయాలి?
10. మనం ప్రస్తుతం ఏమి చేస్తున్నాము? ఏమి చేయలేకపోతున్నాము? ఏమి చేయాలి?

### ముగింపు

అన్ని దేశాలలోని ప్రజలందరూ నిజమైన దేవుడిని ఆరాధించాలంటే మనం ఆ నిజమైన దేవుడిని అందరికీ ప్రకటించాలి. భూమిమీద ఉన్న చాలా మంది లేని దేవుళ్ళను ఆరాధిస్తున్నారు. ఎంతోమంది సృష్టికర్తను తెలుసుకోకుండానే నరకానికి పాత్రులు అవుతున్నారు. దీనికి మనందరం బాధ్యత వహించాలి. వారందరు సువార్త వినేలా మనమందరం సువార్తను ప్రకటించాలి.

– టి. సుధారాణి థామస్, నర్సరావుపేట

# సొంత పనులతో సంతసించక...



అభిషేక్ యంగ్ గ్రాడ్యుయేట్, చాలా చురుకుగా పని చేస్తాడు, విద్యార్థులను కలుస్తుంటాడు, బైబిల్ స్టడీస్‌కి వెళ్తుంటాడు కానీ ఐపియల్ మ్యాచ్‌లు గాని, ఛాంపియన్స్ ట్రోఫి మ్యాచ్‌లు గానీ ఉంటే ఎవరి కంటికీ కనిపించడు, ఏ పనీ చెయ్యడు.. తన ప్రాధాన్యతలు మారిపోతాయి.

అనిల్‌కి, తన భార్యకు సరిపడా జీతాలతో కూడిన ఉద్యోగాలు. కుటుంబ పోషణకు, పిల్లల భవిష్యత్‌కు ఏ లోటూ ఉండదు. కానీ ఈ మధ్య కాలంలో ఏదో బిజినెస్ అంటూ తిరుగుతూ, అసలు సహవాసానికి రావడమే మానేశారు. ఏదైనా పని ఉందంటే అసలు చిక్కడు – దొరకడు. తన పని తనదే.

అజయ్‌కి 2 సం॥ల బాబు ఉన్నాడు. సహవాసానికి అతిథిలా వచ్చి వెళ్తుంటాడు, కారణం అడిగితే బాబు వైపు చూపిస్తాడు. తన పిల్లవాడి ఆరోగ్యం, తన భార్య ఆరోగ్యం పాడవుతుందనే భయంతో ఎక్కడ కూడా సహవాసంలో కన్పించడు. ఏ పనికీ ఒప్పుకోడు.

అశోక్ దేవుణ్ణి నమ్మిన ప్రారంభ రోజుల్లో చక్కగా పని చేసేవాడు. కానీ ఈ మధ్యకాలంలో ఏ పని చెప్పినా తలనొప్పి, కాళ్ళనొప్పి, కీళ్ళనొప్పి అంటూ ఏదోక నొప్పితో ఎవరినీ నొప్పించకుండా తప్పించుకుంటాడు.

అఖిల్‌కి సొంత ఊరిలో మంచి సాక్ష్యం ఉంది. మన సహవాసంలో మంచి అనుభవం ఉంది. ఇదే అదునుగా పిలిచిన ప్రతి మీటింగ్‌కి వెళ్తాడు. పిలిచిన ప్రతి సంస్థలో సభ్యుడిగా ఉంటాడు. అన్ని పరిచర్యలు మనవే అనే ధోరణితో అసలు ఏ పరిచర్యకూ న్యాయం చేయడు.

ఇలాంటి వ్యక్తులు, ఇలాంటి ఉదంతాలు, ఇంతకంటే దారుణమైన కారణాలు చెప్పి దేవుని పని చేయకుండా తప్పించుకొనే వ్యక్తులు మన సహవాసాల్లో కన్పిస్తున్నారు.

ఆనందం కోసం, ఆరోగ్యం కోసం, ఆస్తుల సంపాదనలో, ఆత్మీయ పరిచర్యల కోసం అంటూ ఏ పనీ చేయటానికి కష్టపడని, ఇష్టపడని విద్యార్థులు, గ్రాడ్యుయేట్స్‌ని ఏమనాలి?

మిషన్స్ స్టేట్‌మెంట్‌లో "తామున్న స్థలములో" అనే మాటను ఆలోచిస్తే, తామున్న ప్రదేశంలో పని చేయని వ్యక్తులు, పట్టించుకోని వ్యక్తులు, పనికి న్యాయం చేయలేని వ్యక్తులను ఏమనాలి?

ప్రభువా, ఆంధ్రాని నాకివ్వు లేదా నా ప్రాణం తీసుకో అంటూ ప్రార్థించిన జోసఫ్ అభిషేకరావు లాంటి వ్యక్తులను మరలా చూడలేకపోతే చాలా ప్రాంతాల్లో పరిచర్య ప్రశ్నార్థకంగా మారుతుంది. ఇలాంటి పరిస్థితుల్లో "హగ్గయి" పుస్తకం ఎంతో అర్థవంతంగా సహాయపడుతుంది.

హగ్గయి పుస్తకం యొక్క ముఖ్య సారాంశం "మందిరం పునర్నిర్మాణం". మన మాటలలో చెప్పాలంటే "పని జరిగించుడి". ఈ పుస్తకంలో సైన్యములకు అధిపతియగు యెహోవా అని 14 సార్లు రాయబడింది. ఆయన సార్వభౌమునిగా రాజ్యాలను, రాజులను, సృష్టిని, సృష్టింపబడిన వ్యక్తులను నియంత్రించగలడు. ప్రభువు ప్రవక్త హగ్గయి ద్వారా తన ప్రజలు మందిరం పని ప్రారంభించాలని వారిని హెచ్చరిస్తాడు.

**1. ప్రాధాన్యతల గురించిన విషయాలు**

2వ – సమయం ఇంకను రాలేదు, 4వ –

మందిరము పాడైయుండగా, 4వ - సరంబీ వేసిన ఇండ్లలో ఉండడం.

దేవుని మందిరపు పని ఎగ్గొట్టి తమ సొంత ఇంటి పనులు చేసుకుంటున్నారు. ఆయనను, ఆయన పనిని ప్రక్కనపెట్టి తమ సొంత పనులను నెత్తిన పెట్టుకొన్నారు. తమ సొంత పనులు ప్రాముఖ్యమైపోయి మందిరం పాడైపోతున్నా పట్టించుకోని ప్రజలు, ప్రధాన యాజకులు, నాయకులను మనం గమనించవచ్చు. కాబట్టి సైన్యములకు అధిపతియగు యెహోవా అడుగుతున్నది "మీ ప్రవర్తన గూర్చి ఆలోచించుకొనుడి, మీ ప్రాధాన్యతల గూర్చి ఆలోచించుకొనుడి (5వ).

ఆ రోజులలో ఎంతగా దేవుని మందిరపు పనిని నిర్లక్ష్యపెట్టారంటే 1:1 వచనంలో ఆరవ నెల మొదటి తేదిన, హగ్గయి ద్వారా దేవుడు ప్రవచించాడు, అయితే 1:15 వచనం ఆరవ నెల 24వ దినమున పని ప్రారంభించారు. అంటే 23 రోజుల వరకు చలనం లేదు. చరిత్రకారులు చెప్పేమాట ఏంటంటే "ఆ రోజులు ద్రాక్ష పంట, అంజూరపు పంట చేతికి వచ్చే రోజులు". అందుకే కాబోలు "పంట ముందు, పని తర్వాత" అనుకున్నారు. అంతగా ఆనాటి ప్రజలు తమ ప్రాధాన్యతలు తారుమారు చేసుకున్నారు.

ఈ రోజులలో మన సహవాసాలలో కూడా ప్రాధాన్యతలు మారిపోతున్నాయి. తమ సొంత పనులతో సంతసిస్తూ, సార్వభౌముని పనిని ప్రక్కన పెడుతున్నారు. క్రియాశీలకముగా పని చేసే వ్యక్తులను వెతుక్కోవాల్సిన పరిస్థితులలోకి నెట్టబడుతున్నాము. ఎంత బాధాకరం.

## 2. ఫలితాలను గురించిన సంగతులు

ప్రాధాన్యతలు మారిపోయినప్పుడు, ప్రవర్తన గురించి ఆలోచించుకోవాలి. ప్రవర్తన సరిగా లేకపోతే ఫలితాలు తలక్రిందులై, తారుమారు అవుతాయి. ప్రాధాన్యతలు తారుమారు అయితే - ఫలితాలు తారుమారు అవుతాయి. కాబట్టి ప్రవర్తన గురించి ఆలోచించుకోవాలి. ఫలితాలు ఎంత తారుమారు అవుతాయి అంటే 6,7 వచనాలు చూస్తే

"విస్తారంగా విత్తినా - కొంచెమే పండడం
కడుపు నిండినా - ఆకలి తీరకపోవడం
నీళ్ళు తాగినా - దప్పిక తీరకపోవడం
బట్టలు కప్పుకొన్నా - చలి ఆగకపోవడం
కష్టం చేసినా - సంపాదన చిరిగిన సంచిలో వేయడం'.

మన మాటలో చెప్పాలంటే, సమృద్ధిలో క్షామం, అతివృష్టిలో అనావృష్టి, నిండుదనంలో వెలితి, సంపాదన మనది - సంతోషం మరొకరిది.. ఒక్క మాటలో "ప్రయాస ఎక్కువ - ఫలితం తక్కువ".

ఈ రోజులలో కూడా, సొంత పనులు దేవుని స్థానాన్ని ఆక్రమిస్తున్నాయి. జాగ్రత్తపడదాం. ఫలితాలు తారుమారు అవుతున్నాయి గనుక (1:6,7 మరియు 2:16,17) ప్రవర్తన గురించి ఆలోచించుకొనుడి.

## 3. పని గురించిన సంగతులు

హగ్గయి 1:8 వచనము ప్రకారం పర్వతములు ఎక్కి, మ్రాను తీసుకొని వచ్చి, మందిరము కట్టించిన యెడల దేవునికి మహిమ, దేవునికి సంతోషం (1:8), మనుష్యులకు దీవెన (ఆశీర్వాదము) 2:19. కాబట్టి కష్టపడి, ఇష్టపడి పని జరిగించాల్సిందే (1:8)

సహజముగా ఆ దేశములోని పర్వతాల ఎత్తు సుమారుగా 900 మీటర్లు (2,953 అడుగులు) ఉంటాయి. అలాంటి పర్వతాలు ఎక్కడం ఎంతో కష్టంతో కూడుకున్న పని. దేవుని మందిరపు పని నిమిత్తము కండలు కరగాల్సిందే.

నవ్వుకుంటూ.. తుళ్ళుకొంటూ నరకానికి వెళ్తున్న విద్యార్థి లోకాన్ని చూస్తే, అర్ధాంతరంగా జీవితాలను ముగిస్తున్నారు, అక్రమ సంబంధాలలో చిక్కుకుపోతున్నారు, అశ్లీలతకు అమ్ముడు పోతున్నారు, అపవిత్రతకు (పెళ్ళికి ముందే సెక్స్) అప్పగించుకుంటున్నారు, అబార్షన్‌ల బాటపడుతున్నారు. యోహాను 4:35లో కన్నులు ఎత్తి పొలములను చూడండి అని మన ప్రభువు అన్నాడు. మనము కూడా మన కన్నులు ఎత్తి విద్యార్థులను చూస్తే నాశనము వైపు, నరకము వైపు పరుగెడుతున్నారు. వారిని వాటి నుండి తప్పించే బాధ్యత ఎవరిది? మనది కాదా? మనం సహజముగా సమస్య రాగానే, ప్రార్థన చేస్తాము. కాదనను కాని... సమస్యకు స్పందించాల్సింది ఎవరు? మనమే కదా! లూకా 10:1,2 వచనాలలో కోత విస్తారముగా ఉంది, పనివారు కొద్దిమందే, కోతకు పనివారిని పంపవేడుకొనుడి అని ప్రభువు చెప్పాడు. పని వారి కోసం వేడుకోవాలి, అంతమాత్రమే కాదు పని చేయడానికి వెళ్ళాలి. అందుకనే వేడుకొనుడి, వెళ్ళండి అనేది ప్రభువు మనకిచ్చిన బాధ్యత.

ఎవరు వెళ్ళగలరు లేదా ఎవరు పరిగెత్తగలరు? ప్రభువు చిత్తానికి విధేయత చూపించేవారే? ప్రాణమును ప్రియంగా ప్రేమించుకునేవారు, దేవుని కంటే సుఖానుభవమును ఎక్కువగా ప్రేమించేవారు (2 తిమోతి 4:5) పరిచర్యలో పరిగెత్తలేరు, పని చెయ్యలేరు. రిస్కులేకపోతే ఫలితం లేదు.

మనం హగ్గయి గమనించినపుడు ఎజ్రా 5:1,2 వచనాలలో ప్రవచిస్తాడు, వారితోపాటు కలిసి దేవాలయపు పనిలో తను కూడా పని చేస్తాడు (ప్రవచిస్తాడు + పని చేస్తాడు). కాబట్టి పని చెయ్యటం అన్నది మన ప్రాథమిక బాధ్యతగా గమనించాలి. విశ్వాసులము అని చెప్పటానికి నిదర్శనం మనం క్రియాశీలకముగా పరిచర్యలో పాల్గొనటమే.

## 4. ప్రభువు గురించిన సంగతులు

**1. దేవుని ఖచ్చితత్వము**: హగ్గయి 2:3 వచనాన్ని గమనిస్తే ప్రజలు, దేవుడు పూర్వకాలమున ఈ మందిరమునకు కలిగిన మహిమను, ఇప్పటి కాలపు మందిరపు మహిమతో పోల్చి చూస్తున్నట్లు అర్థమవుతుంది.

ప్రకటన 2:4 వచనంలో కూడా మొదటి ప్రేమను, ఇప్పటి ప్రేమను దేవుడు ప్రశ్నించడం మనము గమనిస్తాము. కాబట్టి మనకు అర్థం కావల్సిన సత్యం ఏమిటంటే దేవుడు మన ప్రేమ విషయంలోను, మన పరిచర్య విషయంలోను, మన పని విషయంలోను గతాన్ని, ప్రస్తుతాన్ని పోల్చి చూస్తాడు... కాబట్టి బహు జాగ్రత్తగా మనం పని జరిగించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

**2. దేవుని మంచితనం**: హగ్గయి 2:4,5 వచనములలో ధైర్యము తెచ్చుకొనుము, ధైర్యము తెచ్చుకొని పని జరిగించుడి, నేను మీకు తోడుగా ఉన్నాను, నిబంధనను జ్ఞాపకం చేసుకొనుడి, నా ఆత్మ మీ మధ్య ఉన్నది అని వారిని ప్రోత్సహిస్తాడు.

ఎంత మంచి దేవుడు. ఎంత ఖచ్చితముగా తన ప్రజలతో మాట్లాడాడో, అంతే కృపను చూపిస్తున్నాడు. హగ్గయి 2:9 ఈ కడవరి మందిరము మహిమ, మునుపటి మందిరపు మహిమను మించును అని వాగ్దానం చేస్తున్నాడు. హగ్గయి 2:19లో ఇది మొదలుకొని నేను మిమ్మును ఆశీర్వదించెదను... అంటూ దీవెనలు కుమ్మరిస్తున్నాడు.

మనము ఇంత మంచి దేవుని సేవను నిర్లక్ష్యపెడుతున్నామంటే ఆశ్చర్యముగా అన్పిస్తుంది. ఎంత సత్యవంతుడో, అంత కృప గల దేవుడిని కల్గి ఉన్నాము. కాబట్టి ఆయన పని బహుజాగ్రత్తగా జరిగిద్దాం.

## 5. మన గురించిన సంగతులు

మనం యుఇయఫ్ఐ ద్వారా ఎంత పొందుకున్నామో, ఎలా పొందుకున్నామో బాగా ఎరిగినవారము. కాబట్టి దేవునికి లెక్క అప్పుచెప్పాల్సినవారము. ఒక్క మాటలో చెప్పాలంటే "అప్పు ఉన్నాము". దేవుని కృపను బట్టి యుఇయఫ్ఐ ద్వారా ఎంత పొందుకున్నామో, ఎలా పొందుకున్నామో, అంతే మోతాదులో తిరిగి ఇవ్వాలి. తిరిగి ఇవ్వలేక పోవడానికి కారణాలేంటో పరిశీలించుకోవాలి.

ప్రతివారికి, ప్రతిదానిలో రిటైర్మెంట్ ఉంటుంది కాని దేవుని పనిలో రిటైర్మెంట్ ఉండదు. నాకు తెలిసిన సీనియర్ గ్రాడ్యుయేట్ అన్న, సరిగ్గా సహవాసానికి రాని, మాట వినని ఒక విద్యార్థిని మైక్రోప్రేయర్ సెల్‌లో భాగంగా తీసుకొన్నాడు. మొదట్లో చాలా కష్టమయ్యింది. అయితే ఈ సీనియర్ గ్రాడ్యుయేట్ అన్న, ఆ విద్యార్థి కాలేజి వదలిపెట్టే సమయం కంటే, అరగంట ముందుగా వెళ్ళి కాలేజి గేట్ దగ్గర వెయిట్ చేసి స్టూడెంట్‌ని కలుసుకొని చక్కగా మాట్లాడుతుండేవాడు. అలా కొన్ని రోజులకు ఆ విద్యార్థి చక్కని విద్యార్థి నాయకుడిగా ఎదిగాడు.



హగ్గయి పుస్తకంలో మనకు నాలుగు విషయాలు అర్థమవుతాయి. ప్రాధాన్యతలు గురించి ఆలోచించుకోండి (4వ), ప్రవర్తన గురించి ఆలోచించుకోండి (5వ), పని గురించి ఆలోచించుకోండి (8వ), ఫలితాలు గురించి ఆలోచించుకొనుడి (6వ). మనం కూడా ఈ విషయాల గురించి ఆలోచిస్తూ పరిచర్య కోసం మెడలు, నడుము, మోకాళ్ళు వంచినప్పుడే స్థిరమైన ఫలితాన్ని చూస్తాము.

ప్రియ యేసునాథా పని చేయ నేర్పు, నీదు పొలములో కూలివానిగా, అంకితం ఈ జీవితం విద్యార్థి లోకానికే, సొంత పనులతో సంతసించక, ఆశతో ఆత్మలన్ అవని వెదకుచూ, అలయక కృంగక కష్టించి పని చేసెదన్..

**– యం. గాలెయ్య,** భీమవరం




# కెరీర్‌లో దేవుని చిత్తం

దేవుని చిత్తాన్ని చేయడానికి మరొక ప్రత్యామ్నాయం లేదు. దేవుని చిత్తం కొన్నిటికే కాదు. మన జీవితంలో ప్రతిదీ ఆయన చిత్తప్రకారం జరగాలని దేవుడు కోరుకుంటున్నాడు. కొన్నిసార్లు అది దేవుని చిత్తం అని తెలిసినా మన ఎంపికలలో దానిని కొట్టేస్తాం. దానికి చాలా కారణాలు ఉండవచ్చు. చాలామంది తెలియకుండానే తప్పుడు ఎంపికల ఉచ్చులలోకి వెళుతూ, వారి చుట్టూ ఉన్న పరిస్థితులను బట్టి దేవుని చిత్తాన్ని పక్కనబెట్టి తమ కిష్టమైన నిర్ణయాలు చేస్తుంటారు. కాబట్టి వాటి ఫలితాలు కూడా చెడుగానే ఉంటాయి. ఉదాహరణకు యోనా నీనెవెకు వెళ్ళడం దేవుని చిత్తం. కానీ యోనా తర్షీషునకు వెళ్ళాడు. ఫలితంగా ఏం జరిగిందో మనకు తెలుసు. కీర్తన 32:8 ప్రకారం నీకు ఉపదేశము చేసెదను, నీవు నడవవలసిన మార్గమును నీకు బోధించెదను. నీ మీద దృష్టియుంచి నీకు ఆలోచన చెప్పెదను. ఎప్పుడు ఇది సాధ్యపడుతుందంటే మనం ఆయన చిత్తాన్ని చేయడానికి ఇష్టపడి ముందుకు వచ్చినప్పుడు మాత్రమే.

### దేవుని చిత్తం ఎందుకు చేయాలి?

ఈ లోకంలో ఉన్న ప్రతి వస్తువుకి ఒక ఉద్దేశ్యం ఉన్నప్పుడు, దేవుని పోలికతో, స్వరూపంలో సృష్టింపబడిన నీకు, నాకు ఒక ఉద్దేశ్యం ఉండవద్దా? ఈ లోకంలో జన్మించిన ప్రతి ఒక్కరికి ఒక ఉద్దేశ్యం ఉంటుంది. యిర్మీయా 1:4-5 ప్రకారం గర్భములో నేను నిన్ను రూపింపకమునుపే నిన్నెరిగితిని, నీవు గర్భము నుండి బయలుపడకమునుపే నేను నిన్ను ప్రతిష్ఠించితిని. జనములకు ప్రవక్తగా నిన్ను నియమించితిని. కాబట్టి ఆ ఉద్దేశ్యాన్ని తెలుసుకోడానికి లేక చేయడానికి మనకు దేవుని చిత్తం అవసరం.

రోమా 12:2 ప్రకారం మీరు ఈ లోక మర్యాదను అనుసరింపక, ఉత్తమమును, అనుకూలమును, సంపూర్ణమునైయున్న దేవుని చిత్తమేదో పరీక్షించి తెలిసికొనునట్లు మీ మనస్సు మారి నూతనమగుటవలన రూపాంతరము పొందుడి. కాబట్టి దేవుని చిత్తం జీవితంలో ప్రతి సందర్భానికి అలాగే కెరీర్‌లో కూడా స్పెసిఫిక్ గాడ్స్ విల్ తెలుసుకోవాలి.

### కెరీర్‌కి దేవుని చిత్తానికి సంబంధం ఏంటి?

మన దర్శనమే యవ్వనస్తుల మధ్య పరిచర్య. మన దర్శనం ప్రకారం, మార్పు చెందిన విద్యార్థులు ప్రభువైన యేసుక్రీస్తు శిష్యులుగా కళాశాల ప్రాంగణాలను, దేశాన్ని ప్రభావితం చేయడం. కళాశాల ప్రాంగణాలు అనగా 'కెరీర్' చాలా ప్రాముఖ్యమైనదని అర్థం అవుతుంది. చదువుల్లో రాణించకుండా దేవుని బిడ్డలంగా ఎలా ప్రభావం చూపించగలం. దేవుని చిత్తంలో ఉన్న ఏ ఉద్యోగమైనా, అది చిన్నదైనా లేక పెద్దదైనా, దేవుని పిల్లలంగా ప్రభావం చూపించాలి.

మన గ్రాడ్యుయేట్ అన్న వాళ్ళు, అక్క వాళ్ళు వివాహం అనగానే దేవుని చిత్తం చేయాలి అంటారు. ఇది చాలా మంచిది. కానీ కెరీర్‌లో దేవుని చిత్తం చేస్తున్నారా అనేది ఎక్కువ సార్లు మాట్లాడం. అంటే దేవుని చిత్తం అవసరం లేదు అనుకొనే అవకాశం లేకపోలేదు. కాబట్టి ఏదో ఒక ఉద్యోగంలో చేరితే చాలు అనుకుంటాం. ఇక్కడే మనకు అర్థం కావాలి. మన కెరీర్‌కి దేవుని చిత్తానికి సంబంధం వుంది. నీ కెరీర్ పట్ల నీకెంత ఆసక్తి ఉందో, అంతకన్నా ఎక్కువ

దేవునికి ఉంది. యిర్మీయా 29:11-12 ప్రకారం మన భవిష్యత్ మనకు తెలియదు కాని దేవునికి బాగా తెలుసు. నోవహు ఒక ప్రత్యేకమైన పని కొరకు పిలువబడ్డాడు. ఆది 6:12-18 ప్రకారం ఒక ఓడను నిర్మించడానికి పిలవబడ్డాడు. ఇప్పటి భాషలో చెప్పాలంటే నోవహు ఒక ఇంజనీర్, ఒక డిజైనర్, బిల్డర్. నోవహు జీవితంలో అది దేవుని చిత్తం. ఆది 6:22 ప్రకారం దేవుడు అతనికాజ్ఞాపించిన ప్రకారం యావత్తు చేసెను. దేవుని చిత్తం, మన పని రెండు సింక్రనైజ్ అయినప్పుడు దాని ఫలితం అద్భుతం. దేవుడు బెసలేలును విచిత్రమైన పనులు చేయడానికి పిలుచుకున్నాడు. దేవుడు బెసలేలు, అహోలీయాబు హృదయాలలో ప్రజ్ఞ పుట్టించాడు. దేవుని చిత్తంలో ఉన్నప్పుడు ఆయన మనల్ని జ్ఞానంతో నింపుతాడు, నడిపిస్తాడు.

నెహెమ్యా కూడా రాజు దగ్గర గిన్నె అందించేవాడు. రాజు సముఖంలో ఉండేవాడు. ఇప్పటి పరిభాషలో చెప్పాలంటే నెహెమ్యా ఒక ప్రముఖ ఆఫీసర్. చాలాసార్లు దేవుడు మనల్ని ఉన్నతమైన స్థితిలో ఉంచాలనుకున్నప్పుడు దేవుని చిత్తం తెలుసుకోకుండా మనల్ని మనం తక్కువగా అంచనా వేసుకుంటాం. మరొక ఎక్స్ట్రీమ్ ఏంటంటే మనకి సివిల్ సర్వీసెస్‌లో ఉద్యోగం తెచ్చుకోవాలని ఉంటుంది. మనకు తెలివితేటలు ఉంటాయి. దానికొరకు ఐదు లేదా పది సంవత్సరాలు కష్టపడిన తరువాత మనకు ఆ ఉద్యోగం రాదు. అప్పుడది దేవుని చిత్తం కాదు అని చెపుతాం. మరి ఈ పది సంవత్సరాలు తిరిగి రావు కదా? ముందే దేవుని చిత్తాన్ని కనుక్కోకుండా ఇలాంటి పనులు చేస్తూ తెలియకుండానే ఒక లాంటి డిప్రెషన్‌కి వెళ్ళిపోతారు.

చిన్న ఉద్యోగమైనా పెద్ద ఉద్యోగమైనా అది దేవుని చిత్తం అయినప్పుడు అది మనకు సంతృప్తినిస్తుంది. దేవునికి మనం మహిమకరంగా ఉండగలం. మన సమస్య ఏంటంటే దేవుని చిత్తాన్ని, కెరీర్‌ను వేరుగా చూడటం. కానీ ఈ ఆర్టికల్ ఉద్దేశ్యం మన కెరీర్‌లో దేవుని చిత్తాన్ని తెలుసుకోవాలని. మన గ్రాడ్యుయేట్స్‌ను మన స్టూడెంట్స్‌ను ఆవిధంగా ప్రోత్సహించాలి.

## దేవుడు లేని కెరీర్

మైకేల్ జాక్సన్ అమెరికాకు చెందిన ఒక ప్రముఖ సంగీత కళాకారుడు. 2009లో ఇతను మరణించాడు. ప్రపంచంలో అత్యధికంగా అమ్ముడుపోయిన మ్యూజిక్ ఆల్బం 'థ్రిల్లర్'. ఈయన హెచ్ఐవి/ఎయిడ్స్‌కు వ్యతిరేకంగా చేసిన కృషి వల్ల రోనాల్డ్ రీగన్ చేతుల మీదుగా మానవతా పురస్కారాన్ని అందుకున్నాడు. ప్రపంచంలోని పాప్ సింగర్‌గా ప్రపంచాన్ని ఉర్రూతలూగించాడు. సమాజంలో అత్యున్నత స్థానానికి చేరుకున్నాడు. కానీ డ్రగ్స్‌కి అల వాటుపడ్డాడు. ఒకరోజు ఆయన ఇచ్చిన స్టేట్‌మెంట్ "నాకు అన్నీ వున్నా ఒంటరినే". సంపన్నుడే కాని దేవుడు లేని జీవితం ఖాళీ జీవితం. ఆయన చిత్తం లేని కెరీర్ దేవుని దృష్టిలో విలువ లేనిది.

తన క్రికెట్ ప్రతిభకు ఫలితంగా అర్జున అవార్డు, పద్మశ్రీ, రాజీవ్ గాంధీ ఖేల్‌రత్న, పద్మవిభూషన్ లాంటి అవార్డులను పొందిన సచిన్ టెండుల్కర్‌ను క్రికెట్ దేవుడు అంటారు. బీహార్‌లోని ఒక గ్రామంలో 5.5 అడుగుల విగ్రహాన్ని పెట్టి ఒక టెంపుల్ కట్టించి సచిన్ టెండుల్కర్‌ను దేవుడుగా పూజిస్తున్నారు. జీవితంలో ఏది సాధించినా దేవుడు లేని కెరీర్ జీరోతో సమానం. ఎంతమంది పోలీస్ ఆఫీసర్స్ సూసైడ్ చేసకున్నవారు, తుపాకీతో కాల్చుకుని చనిపోయినవారు ఉన్నారు. వారు కెరీర్‌లో సక్సెస్ అయ్యారు కాని జీవితంలో ఓడిపోయారు. అందుకే కెరీర్‌కి – జీవితానికి, జీవితానికి – దేవునికి , కెరీర్‌కి – దేవుని చిత్తానికీ సంబంధం వుంది. కాబట్టి ప్రియ తమ్ముడు, చెల్లి బయటవారితో పోల్చుకోవద్దు.

పౌలు గారు ఫిలిప్పీ 3:8 ప్రకారం నిశ్చయముగా నా ప్రభువైన యేసుక్రీస్తును గూర్చిన అతిశ్రేష్టమైన జ్ఞానము నిమిత్తమై సమస్తమును నష్టముగా ఎంచుకొనుచున్నాను. ఒకవేళ పౌలు గారిని అడిగితే నీవు చాలా జ్ఞానవంతుడివి కదా మరి నీవు ప్రభువును తెలుసుకోకముందు, తెలుసుకొన్న తర్వాత ఏమైనా మార్పు నీ కెరీర్‌లో చూశావా అంటే ఆయన చాలా విషయాలు చెబుతాడు. యేసయ్యను నేను అంగీకరించకముందు నా జీవితం నా యిష్టం. కాని ఇప్పుడు నా జీవితం, కెరీర్ దేవుని చిత్తం. నా కెరీర్‌లో ప్రభువు చిత్తం ఏంటంటే అన్యులకు సువార్తను ప్రకటించడం. కాబట్టి నా గురి మారింది, నా నడక మారింది. నేను ఇప్పుడు గురియొద్దకే పరిగెడుచున్నాను అంటాడు. మరి ఎప్పుడైనా మన కెరీర్‌ని దేవుని పాదాల దగ్గరకు తెచ్చామా?

## కెరీర్‌లో దేవుని చిత్తాన్ని ఎలా తెలుసుకోగలం?

దేవుడు డైరెక్ట్‌గా నీవు ఈ ఉద్యోగం చేయి అని చెప్పకపోయినా, కొన్ని పరిస్థితులను బట్టి మనం తెలుసుకోవచ్చు.

1. మొదటగా మన క్వాలిఫికేషన్స్, సామర్థ్యాలు, మన దృక్పథం, మన పర్సనాలిటి, మన స్కిల్స్, మన ఇష్టాలు, మన అభిరుచులు, మన కోర్ సబ్జెక్ట్స్ వీటన్నిటిని దృష్టిలో ఉంచుకొని ఆలోచించాలి.
2. మన నిర్ణయాలను ఆయనకు అప్పగించుకోవాలి. సామె 3:5-6 “నీ స్వబుద్ధిని ఆధారము చేసుకొనక నీ పూర్ణహృదయముతో యెహోవాయందు నమ్మికయుంచుము. నీ ప్రవర్తన అంతటియందు ఆయన అధికారమునకు ఒప్పుకొనుము. అప్పుడు ఆయన నీ త్రోవలను సరాళము చేయును”.
3. మనకు ఓపెన్ మైండ్ కావాలి. మన ఇష్టానికి దేవుడు వ్యతిరేకంగా చెప్పినా దానిని అంగీకరించడానికి.
4. దేవుని వాక్యాన్ని జాగ్రత్తగా చదవాలి, సరైన విధానంలో అర్థం చేసుకోవాలి. కీర్తన 119:105
5. పరిశుద్ధాత్మ నడిపింపు తీసుకోవాలి. యెషయా 30:21.
6. దేవుని సన్నిధిలో ప్రార్థన చేయాలి. ఉదా: పౌలు గారు ప్రార్థన ద్వారా దేవుని చిత్తాన్ని నెరవేర్చాడు. యేసుప్రభువు ప్రార్థన ద్వారా తండ్రి చిత్తాన్ని నెరవేర్చారు. నెహెమ్యా ప్రార్థన ద్వారా ఆయన చిత్తాన్ని నెరవేర్చాడు.
7. చుట్టూవున్న పరిస్థితుల్ని అర్థం చేసుకోవాలి.
8. కొంతమంది ప్రత్యేకమైన దేవుని జ్ఞానం కలిగిన వారు సలహా ఇస్తారు. వారి గైడెన్స్ తీసుకోవాలి.
9. అన్ని పరిస్థితుల్లో దేవుణ్ణి నమ్మాలి.
10. చిన్న చిన్న విషయాలకు కూడా దేవునిపై ఆధారపడాలి.

## కెరీర్‌లో దేవుని చిత్తాన్ని చేయలేకపోడానికి కారణాలు

1. మన గురించి మనం సరైన అంచనా వేసుకోకపోవడం. కొన్నిసార్లు మన గురించి మనం తక్కువగా అంచనా వేసుకొని కృంగిపోవడం. కొన్నిసార్లు మన గురించి మనం ఎక్కువగా వూహించుకొని తప్పిపోవడం. ఇవి రెండూ ప్రమాదమే.
2. కొన్నిసార్లు దేవుడు మనల్ని సివిల్ సర్వెంట్స్‌గా ఉండాలని నడిపిస్తున్నప్పుడు మన ఇంట్లోవారే మనల్ని నిరుత్సాహ పరచడం. ఉదాహరణకు నీవు అమ్మాయివి కదా కలెక్టర్ అవ్వడం కష్టం. దేవుని పిల్లలకు ఈ ఉద్యోగాలు సరిపడవు. ఎందుకంటే పొలిటికల్ ఇన్వాల్‌మెంట్ ఎక్కువగా ఉంటుంది. నీకు మనశ్శాంతి ఉండదు.
3. మనం పాపంలో వుండటం వలన దేవుని నడిపింపు అర్థంకాకపోవడం.
4. ఏదో ఒకటిలే అని రాజీపడడం.
5. లంచాలు ఇచ్చి ఉద్యోగం సంపాదించాలని చూడడం.
6. లోకస్తులతో పోల్చుకోవడం.
7. కొన్ని ఉద్యోగాలు చేయడం దేవుని చిత్తం కాదనుకోవడం. ఉదా: లాయర్స్, ఐఏయస్, ఐపిఎస్, బిజినెస్, పోలీస్.

## ముగింపు

ప్రియ తమ్ముడూ, చెల్లీ ఇప్పటివరకు కెరీర్‌లో దేవుని చిత్తం గురించి ఆలోచించలేదా? ఆయన చిత్తాన్ని ప్రక్కనబెట్టి కెరీర్‌ను ప్లాన్ చేసుకుంటున్నావేమో. దేవుని చిత్తాన్ని ప్రక్కనబెట్టి నీ సొంత ప్రయత్నాలతో ఉద్యోగాల కోసం ప్రయత్నిస్తున్నావా? ఒక్కసారి ఆలోచించు. మన గురించి మన భవిష్యత్తు గురించి తెలిసిన దేవునితో కలిసి మన కెరీర్‌ని ప్లాన్ చేసుకుందాం. మన ప్రవర్తన అంతటియందు ఆయన అధికారానికి ఒప్పుకుందాం. మన కెరీర్‌లో ఆయన చిత్తాన్ని కనుగొందాం. దానిని జరిగిద్దాం. ఆయన నామాన్ని మన కెరీర్ ద్వారా మహిమపరుద్దాం. యేసయ్యను మాదిరిగా తెలుసుకుందాం. యోహాను 4:34లో యేసు వారిని చూచి – నన్ను పంపిన వాని చిత్తము నెరవేర్చుటయు, ఆయన పని తుదముట్టించుటయు నాకు ఆహారమైయున్నది. ప్రియ తమ్ముడూ, చెల్లీ నీ కెరీర్‌లో కూడా దేవుని చిత్తాన్ని చేయడానికి నిర్ణయం చేయగలవా?

– డా. యం. సాల్మన్‌రాజు, వైజాగ్





## మిషన్స్ గురించిన

# అపోహాలు

**అపోహ:** మిషన్స్ నాకు చెందినది కాదు.

**వాస్తవం:** మిషన్స్ అనగానే మొట్ట మొదట వచ్చే ఆలోచన ఇది నాకు చెందినది కాదులే అని చాలామంది విశ్వాసులు అనుకొంటారు. ఇది సంపూర్ణ సమర్పణ కలిగినవారికి అని మరి కొందరు అనుకొంటారు. “మీరు సర్వలోకమునకు వెళ్ళి సర్వసృష్టికి సువార్తను ప్రకటించుడి” (మార్కు 16:15), “ఆయన శిష్యులు గా చేయండి” (మత్తయి 28:19) అనే ఆజ్ఞను తన శిష్యులకు ఇచ్చాడు. యేసుక్రీస్తు ప్రభువును రక్షకునిగా, దేవునిగా అంగీకరించిన ప్రతి ఒక్కరూ ఆయన శిష్యులే. ఆనాడు తన శిష్యులతో చెప్పిన దేవుడు ఈ రోజు మనతో చెబుతున్నాడు. తండ్రి నన్ను పంపిన ప్రకారం నేనును మిమ్మును పంపుచున్నానని” (యోహాను 20:21) చెప్పాడు. ఈ ఆజ్ఞ ఇప్పుడు ఆయన శిష్యులుగా ఉండడానికి ఇష్టపడిన మనకు కూడా వర్తిస్తుంది. ఆజ్ఞ అతిక్రమము పాపము. ఆయన చెప్పిన మాట వినకపోతే మనం పాపం చేసినవారం అవుతాము. కాబట్టి మిషన్స్ అనేది ప్రతి విశ్వాసికి చెందినది. ఈ ఆజ్ఞను అందరూ వ్యక్తిగతంగా నెరవేర్చాలి.

**అపోహ:** ఇయు నాల్గవ లక్ష్యం, ఇజియఫ్ ఐదవ లక్ష్యం గురించి ప్రస్తుతం ఆలోచించనవసరం లేదనుకోవడం.

**వాస్తవం:** ఇయు నాల్గవ లక్ష్యం, ఇజియఫ్ ఐదవ లక్ష్యం స్టేట్‌మెంట్ ఏమి చెబుతుందంటే, “విద్యార్థులు, గ్రాడ్యుయేట్స్ ఇద్దరూ తమ జీవితంలో దేవుని చిత్తాన్ని కనుగొని, ఆయన చిత్తానికి లోబడి, తామున్న చోట గానీ, ప్రపంచంలో మరెక్కడైనాగానీ ప్రేషిత సేవలో పాల్గొనాలి”. చాలా ఇయు, ఇజియఫ్‌లు మొదటి రెండు లక్ష్యాల గురించి ఆలోచించడం, కార్యక్రమాలు ప్లాన్ చేయడం జరుగుతుందే గానీ సాక్ష్యం, మిషన్స్ గురించి ఆలోచించరు. చాలామంది సీనియర్ స్టూడెంట్స్, గ్రాడ్యుయేట్స్ మిషన్స్ రిట్రీట్స్‌కి, మిషన్స్ ప్రోగ్రామ్స్‌కి వెళ్ళడానికి ఇష్టపడరు. వెళితే ఒకవేళ దేవుడు ఎక్కడ తన ప్రేషిత పరిచర్యకు పిలుస్తాడోనని ఏదో పని ఉందని సాకులు చెబుతూ తప్పించుకొంటారు. చాలామందితో దేవుడు మాట్లాడుతున్నా, సుఖవలయాన్ని విడిచిపెట్టడానికి ఇష్టపడడం లేదు. ప్రతి ఒక్కరూ దేవుని చిత్తాన్ని తెలుసుకొని, దేవుడు చేయమన్న పరిచర్యను చేయాలి. అప్పుడే ఆశీర్వాదం వస్తుంది. తోటి వారికి మాదిరిగా కూడా ఉంటాము.

**అపోహ:** మిషన్స్ అనగానే నార్త్ ఇండియా వెళ్ళడం అనుకోవడం.

**వాస్తవం:** సహజంగా మిషన్స్ పరిచర్య అనగానే మొట్టమొదటిగా చాలామందికి వచ్చే ఆలోచన నార్త్ ఇండియాకి వెళ్ళడం. ఇది ఎంతమాత్రము సరైనది కాదు. మిషన్ స్టేట్‌మెంట్ ప్రకారం ముందు మనమున్న చోట ప్రభువు మనస్సుతో పని చేయాలి. అంటే మనమున్న ఇయులో స్థానిక, ఔట్‌రీచ్, అన్‌రీచ్డ్ కాలేజీలలో సేవ చేయాలి. అలా పనిచేస్తూ ఉంటే దేవుడు పిలిస్తే నార్త్ ఇండియా అయినా, 10/40 విండోలోని దేశాలైనా, ప్రపంచంలో మరెక్కడికైనా వెళ్ళడానికి విధేయత చూపాలి. దేవుని చిత్తం తెలుసుకోవడం, దానికి లోబడడం చాలా ముఖ్యమైన విషయం. ఆయన చిత్తాన్ని జరిగించేవారు నిరంతరం నిలుస్తారు (1 యోహాను 2:17).

**అపోహ:** మన గురించి ప్రార్థన చేసుకొంటే సరిపోతుంది.

**వాస్తవం:** 1 తిమోతి 2:1-2 ప్రకారం “మనము సంపూర్ణ భక్తియు మాన్యతయు కలిగి, నెమ్మదిగాను సుఖముగాను బ్రతుకు నిమిత్తము, అన్నిటికంటె ముఖ్యముగా మనుష్యులందరి కొరకును, రాజుల కొరకును అధికారులందరి కొరకును విజ్ఞాపనములు



ను ప్రార్థనలును యాచనలును కృతజ్ఞతాస్తుతులును చేయవలెననే హెచ్చరిక ఉంది. మనుష్యులందరి కోసం ప్రార్థించాలని ఉంది. చాలాసార్లు మన ప్రార్థనలలో స్వార్థం ఉంటుంది. మన ఇల్లు, ఇయు, సంఘం దాటి మనం ప్రార్థన చేయం. ప్రపంచంలో మిషనరీలు ఎంతోమంది ఉన్నారు. చాలామంది మిషనరీల కోసం, వారి పరిచర్య కోసం ప్రార్థించాలని అనుకోరు. వారు ఎన్నో కష్టనష్టాలకు, ఆరోగ్య సమస్యలకు ఓర్చి దేవుని పనిని ఎంతో నమ్మకంగా చేస్తున్నారు. వారి గురించి, మిషన్ ఏజన్సీల గురించి మనం కూడా తప్పకుండా ప్రభువు మనస్సుతో ప్రార్థించాలి.

**అపోహ:** మిషన్స్ పరిచర్యకు ఇవ్వాల్సిన అవసరంలేదు

**వాస్తవం:** మిషన్ పరిచర్యలో ఉన్నవాళ్ళకు చాలా అవసరాలు ఉంటాయి. కొంతమంది మిషనరీస్‌కు చాలా తక్కువ జీతాలు ఇస్తారు. వారి ప్రాథమిక అవసరాలు కూడా తీర్చబడవు. చాలా సార్లు ఆరోగ్యం సరిగా ఉండదు. చాలా సుదూర ప్రయాణాలు చేయాల్సి వస్తుంది. అలాంటప్పుడు వారికి చాలా డబ్బు అవసరం ఉంటుంది. మన తెలుగు రాష్ట్రం నుండి వెళ్ళిన మిషనరీ స్టూడెంట్స్ ఫీజులు కట్టడానికి డబ్బులు లేక చాలా ఇబ్బంది పడుతుంటారు. టెంట్‌మేకర్స్‌గా వెళ్ళిన గ్రాడ్యుయేట్స్ కూడా వెంటనే ఉద్యోగం దొరకక చాలా ఇబ్బందులు పడుతుంటారు. చాలాసార్లు మిషనరీస్‌కి పై దేశాల నుండి డబ్బు వస్తుందని కొందరనుకొంటారు. అది కేవలం ఒక అపోహ మాత్రమే. మన యుఇయస్ఐ నుండి మిషనరీస్‌గా వెళ్ళిన వారికి కూడా అలా ఉండదు. వారి అవసరాల కోసం దేవునివైపు చూస్తారు. కాబట్టి కొందరు మిషనరీలను దత్తత తీసుకొని వారి అవసరాలు కొన్ని అయినా తీర్చాలి. అలాగే యస్వీపి, జివిపికి వెళ్ళేవారికి కూడా ఆర్థిక అవసరాలు ఉంటాయి. మరిన్ని వివరాల కోసం యుఇయస్ఐ-ఏపి ట్రెజరర్‌ను, మిషన్స్ డిపార్ట్‌మెంట్ సెక్రటరీని సంప్రదించగలరు.

**అపోహ:** స్టేట్‌మిషన్స్ ట్రైనింగ్ క్యాంప్‌కు వెళ్ళకపోయినా ఫర్వాలేదు.

**వాస్తవం:** మన ఇయు, ఇజియఫ్‌లలో యల్‌టి క్యాంప్‌కి, సియంటిసికి దాదాపు అర్హులైన ప్రతి ఒక్కరిని పంపుతాము. అయితే యస్‌యంటిసికి రావడానికి ప్రతి గ్రాడ్యుయేట్, యల్‌టికి హాజరైన ప్రతి విద్యార్థి అర్హుడే అయినా చాలా తక్కువ మంది యస్‌యంటిసికి, యన్‌యంటిసికి వస్తున్నారు. అలాగే యస్వీపి, జివిపి, మెట్, ఆర్‌యంసి మొదలైన వాటికి వెళ్ళడానికి స్టూడెంట్స్‌ని గ్రాడ్యుయేట్స్‌ని ప్రోత్సహించాలి. ఈ విషయంలో ఎవరో వెళతారు, ఎవరో పంపిస్తారు, ఎవరో చేస్తారు అనే భావంతో కాకుండా ప్రతిఒక్కరం బాధ్యత తీసుకొందాం, ప్రభువు మనస్సుతో ప్రేషిత సేవను ప్రోత్సహిద్దాం.

**అపోహ:** ఇక్కడే ఉంటూ, మిషనరీ పరిచర్యలో పాలిభాగస్తులం అవ్వడం అసాధ్యం.

**వాస్తవం:** ఇక్కడే ఉంటూ, మిషనరీ పరిచర్యలో పాలిభాగస్తులం అవ్వడం సాధ్యం కాదు అని అనుకోకూడదు. మనం ఇక్కడే ఉంటూ ప్రపంచ వ్యాప్తంగా జరుగుచున్న మిషనరీ పరిచర్య వివరాలు సేకరించి వారికోసం క్రమం తప్పకుండా ప్రార్థించవచ్చు. అలాగే మిషనరీ పరిచర్యకు వెళ్ళే వారిని సిద్ధపరచి పంపవచ్చు. ఆర్థికంగా సహాయం చేయవచ్చు. ఫోన్‌ద్వారా వారిని పలకరించి ప్రోత్సహించవచ్చు.

అలాగే మన పూర్వ ఇయు విద్యార్థులు, ఇప్పుడు ఎక్కడ ఏమి చేస్తున్నారో తెలుసుకోవచ్చు. ఒకవేళ వారు త్యాగపూరితంగా మిషనరీ విద్యార్థిగా గానీ, టెంట్ మేకర్‌గా గాని, వెళ్ళినట్లయితే వారికోసం ప్రత్యేక ప్రార్థనా సహకారాన్ని అందించవచ్చు. మిషనరీ పరిచర్యలో నిమగ్నమైనంత మాత్రాన, వారేమీ భౌతిక అవసరతలకు అతీతులు కారు. వారు కూడా మనవలె అనేక అవసరాలను కలిగి ఉంటారని గ్రహించి వారికి ప్రతివిషయంలోనూ సహాయసహకారాలు అందించడానికి ఎల్లప్పుడూ సిద్ధంగా ఉండాలి. అలాగే మిషనరీ బయోగ్రఫీలు చదవడం, మిషన్స్ రిట్రీట్స్‌కి హాజరవ్వడం ద్వారా ఈ పరిచర్య గురించి మరింత ఎక్కువగా తెలుసుకోవచ్చు.

**– బి. రవికుమార్,** కారంపూడి
సెక్రటరీ, మిషన్స్ డిపార్ట్‌మెంట్





# ఐడా సోఫియా స్కడ్డర్

## సియంసి వెల్లూర్ వ్యవస్థాపకురాలు

అది ప్రపంచంలో, భారతదేశంలో అత్యాధునిక హాస్పటల్స్‌లో ఒకటిగా ప్రసిద్ధిగాంచింది. 2,210 బెడ్స్, 144 స్పెషలైజ్డ్ డిపార్ట్‌మెంట్స్, వేల సంఖ్యలో వైద్యులు. 1900సం॥లో ఒక చిన్న గదిలో అంటే 10/12 చిన్న గదిలో, ఒక డాక్టర్‌తో ప్రారంభమైన హాస్పటల్ ఇప్పుడు మహా వృక్షములాగా విస్తరించింది. అదే సియంసి వెల్లూరు హాస్పటల్. దాని వ్యవస్థాపకురాలైన ఐడా స్కడ్డర్ దేవుని పిలుపుకు విధేయత చూపించడాన్ని బట్టి భారతదేశానికి, ప్రపంచానికి ఎలా వెలుగుగా ఉందో ఆమె చరిత్రను చదివితే మనకు అర్థమవుతుంది. ఈ హాస్పటల్ ప్రారంభమై 125 సంవత్సరాలు అయిన సందర్భాన్ని పురస్కరించుకొని ఈ వ్యాసాన్ని అందిస్తున్నాం.

### ఐడా స్కడ్డర్ పూర్వీకుల సమర్పణ

ప్రపంచంలోనే మొట్ట మొదటి అమెరికన్ మెడికల్ మిషనరీ అయిన డా. జాన్ స్కడ్డర్ యొక్క మనవరాలు డా.ఐడా స్కడ్డర్. డా. జాన్ స్కడ్డర్ యొక్క ఏడుగురు కుమారులు, ఇద్దరు కుమార్తెలు కూడా మిషనరీలుగా తమ జీవితాన్ని సమర్పించుకొన్నారు. స్కడ్డర్ కుటుంబానికి చెందిన నాలుగు తరాలలోని 42 మంది భారతదేశంలోని మిషనరీ పరిచర్య నిమిత్తం అనేక వందల సంవత్సరాలను వెచ్చించారు. డా. జాన్ స్కడ్డర్ చిన్న కుమారుడైన జూనియర్ జాన్ స్కడ్డర్ యొక్క కుమార్తె డా. ఐడా స్కడ్డర్. డా. జూనియర్ జాన్ స్కడ్డర్ భారతదేశంలో మెడికల్ మిషనరీగా పని చేశాడు.

### ఐడా స్కడ్డర్ జననం, బాల్యం

ఐడా స్కడ్డర్ తమిళనాడు రాష్ట్రంలోని రాణిపేట్‌లో 9 డిసెంబర్ 1870లో జన్మించింది. 1875వ సం॥లో దక్షిణ భారత దేశంలో కరువు సంభవించి, 3 మిలియన్ ప్రజలు ఆకలితో చనిపోయారు. మరణం, బాధ అన్నివైపులా రాజ్యమేలుతున్న అంధకార రోజులు. రోడ్‌కు ఇరువైపులా గుట్టలు గుట్టలుగా పడియున్న చిన్నపిల్లల మృతదేహాలు. ఆహారం కోసం తమ ఇంటి గేట్ ముందు పసిపిల్లల ఆకలి ఆర్తనాదాలు. ఈ సంఘటనలు ఆ పసి మనస్సు మీద చెరగని ముద్రవేశాయి. ఇటువంటి కరువు పరిస్థితుల్లో





ఆమె తల్లిదండ్రులు ఎంతో సేవచేశారు. ఆమెకు 8 సంవత్సరాలు వచ్చినప్పుడు తన తల్లిదండ్రులతో పాటు అమెరికా దేశానికి వెళ్ళింది. అమెరికా వెళ్ళిన తర్వాత ఆమె తీసుకొన్న ఒక దృఢ నిర్ణయం ఏంటంటే "తాను ఎన్నటికీ డాక్టర్ కాకూడదని, మెడికల్ మిషనరీగా భారతదేశానికి ఇంకెన్నడూ వెళ్ళకూడదని". ఆమె అక్కడే సుఖసౌఖ్యాలు, సురక్షితమైన వాతావరణంలో పెరుగుతూ అక్కడే వివాహం చేసుకోవాలని కలలు కంటూ జీవించింది. మిషనరీ జీవితమనే ఆలోచననే ఆమె తృణీకరించింది.

కొన్ని సంవత్సరాల తర్వాత ఐడా స్కడ్డర్‌ని అమెరికాలోని ఆంటీ దగ్గర విడిచిపెట్టి ఆమె యొక్క తల్లిదండ్రులు మరలా ఇండియాకు తిరిగి వచ్చారు. ఆమె తన గ్రాడ్యుయేషన్‌ని నార్త్‌ఫీల్డ్ సెమినరీ నుండి పూర్తిచేసింది. ఆమె గ్రాడ్యుయేషన్ పూర్తిచేసుకొన్న తర్వాత వివాహం చేసుకొని అమెరికాలో స్థిరపడాలని కలలుకంటూ, ప్రణాళికలు వేసుకొంది. అకస్మాత్తుగా ఒక రోజు తన తండ్రి నుండి ఒక టెలిగ్రామ్ వచ్చింది "మీ తల్లిగారికి ఆరోగ్యం బాగాలేదు, ఈ సమయంలో నీ అవసరం ఆమెకు ఉన్నది, మీ అమ్మ ఆరోగ్యం కుదుట పడేవరకు నాకు ఆసుపత్రిలో సహాయం చేయాలి" అని అందులో ఉన్నది. ఆమె అయిష్టంగా ఇండియాకు బయలుదేరుతున్నప్పుడు ఆమె స్నేహితులు ఆమెతో "నువ్వు మరలా ఇండియాకు తిరిగి వెళ్ళవని మేము అనుకొన్నాము" అని అన్నారు. అప్పుడు ఆమె "మా అమ్మగారికి ఆరోగ్యం బాగాలేదు, నా అవసరం ఆమెకున్నది. మా అమ్మగారు కోలుకొన్న తర్వాత నేను మరలా తిరిగి అమెరికా వస్తాను" అని చెప్పింది. 1890 సం॥లో ఆమె భారత దేశానికి వచ్చి, తన తల్లికి సపరిచర్యలు చేస్తూ, క్లినిక్‌లో తన తండ్రికి సహాయం చేసేది.

## ఐడా స్కడ్డర్ జీవితంలో టర్నింగ్ పాయింట్

ఒకరోజు సాయంత్రం ఆమె గదిలో ఒంటరిగా కూర్చొని డైరీ రాస్తూ ఉంది. వరండాలో అడుగుల శబ్దం, తర్వాత తలుపు కొట్టిన శబ్దం వినబడింది. ఆమె తలుపు తెరచి చూస్తే ఒక బ్రాహ్మణ పురుషుడు ఉన్నాడు. అతను చాలా వేదనతో "నా భార్యకు 14 సంవత్సరాలు, పురిటి నొప్పులతో బాధపడుతూ చనిపోయే ప్రమాదంలో ఉన్నది. అక్కడ ఉన్న స్త్రీలు ఏమీచేయలేకపోయారు. మీరు ఇండియాకు వచ్చారని విన్నాను. మీరు ఆమెకు సహాయం చేస్తారని ఆశిస్తున్నాను" అని అన్నాడు. ఆమె అతనితో "స్త్రీ ప్రసవం గురించి నాకేమి తెలియదు. నేను మీకు సహాయం చేయలేను గానీ నా తండ్రి వైద్యుడు, అతను మీకు సహాయం చేస్తాడని చెప్పి, వెంటనే ఆయనను తీసుకొని వస్తాను, ఆయన నీ అందమైన భార్యను బ్రతికిస్తాడని" చెప్పి ఆమె తండ్రిని పిలువడానికి లోపలికి వెళ్తుంటే, ఆ వ్యక్తి హఠాత్తుగా తన చేతులెత్తి ఐడా స్కడ్డర్‌కు నమస్కారం చేస్తూ, సాగిలపడుతూ ఆమెతో ఇలా అన్నాడు "నేను పురుషున్ని నా ఇంట్లోకి తీసుకొని వెళ్ళలేను. ఇంతవరకు నా భార్య ముఖాన్ని ఒక్క పురుషుడు కూడా చూడలేదు. మీరు రాకపోతే ఆమె చనిపోతుంది" అని చెప్పాడు. ఐడా స్కడ్డర్ పదే పదే అతన్ని బ్రతిమలాడుతూ "నా తండ్రితో పాటు నేనూ వస్తాను, నా తండ్రి యొక్క సూచనల్ని బట్టి నేను చేయగలిగినదంతా చేస్తానని" చెప్పింది. అందుకతను "మా సాంప్రదాయం ప్రకారం నా భార్య శిశువును ఇంకో పురుషుడు డెలివరీ చేయకూడదు" అని అంటూ "ఆమె తప్పని సరిగా చనిపోతుంది, ఆమె చాలా అందమైన అమ్మాయి" అంటూ ఏడుస్తూ వెళ్ళిపోయాడు. ఆమె చాలా బాధతో, వేదనతో తన యొక్క డెస్క్ దగ్గర కూర్చున్నది.

కొంత సమయం తర్వాత ఐడా స్కడ్డర్ మరో అడుగుల శబ్దం విన్నది. అతను తన మనస్సును మార్చుకొని మరలా వచ్చాడేమోనని ఆశతో పరుగెత్తి తలుపు తీసింది. అక్కడ ఒక ముస్లిం నిల్చొని ఉన్నాడు. అతను కూడా మొదటి వ్యక్తి చెప్పినట్లే చెప్పి తనను రమ్మని ప్రాధేయపడ్డాడు. ఐడా స్కడ్డర్ కూడా తన తండ్రిని పిలుస్తానని అతనితో చెప్పింది. అతను వద్దని నా భార్య తప్పకుండా చనిపోతుందని

బాధతో చెబుతూ వెళ్ళిపోయాడు. ఐడా స్కడ్డర్ దానిని భరించలేక పోయింది. మరలా అదే రోజు సాయంత్రం అడుగుల శబ్దము విన్నది. మరో వ్యక్తి నుండి అదే అభ్యర్థన. ఆ రాత్రంతా ఐడా స్కడ్డర్‌కు నిద్రపట్టలేదు. డెలివరీ చేయడానికి ఒక మహిళా డాక్టర్ లేకపోవడం వలన అదే రాత్రి ఆ ముగ్గురు స్త్రీలు, గర్భంలోని శిశువులు మరణించారు.

ఒక మహిళా వైద్యురాలు కూడా లేకపోవడం వలన తన చెయ్యి తాకగలిగే దూరంలో ముగ్గురు మహిళలు, వారి గర్భంలోని ముగ్గురు శిశువులు చనిపోవడం అనేది ఆమె మనస్సును కలచివేసింది. తన తండ్రి అంటే పురుషుడు కాబట్టి ఏమీ చెయ్యలేకపోయాడు అయితే నేను మహిళను, వారి కోసం నేనేమీ చేయలేనా? అనే సంఘర్షణ ఆమెలో మొదలైంది. మరునాడు ఉదయం చనిపోయిన ఆ ముగ్గురు స్త్రీల ఫ్యూనరల్ శబ్దాలు ఆమె చెవిలో ప్రతిధ్వనిస్తూ ఉండగా భారభరితమైన హృదయంతో ఇలా ప్రార్థన చేసింది. "దేవా, నేను వారి కోసం వైద్యురాలిగా పనిచేయాలనేది నీ చిత్తమైతే, ఈ స్త్రీలకు సహాయం చేయడానికి ప్రయత్నిస్తూ నా శేష జీవితాన్ని భారత దేశం కోసం అంకితం చేస్తాను". ఆ ప్రార్థన చేస్తున్నప్పుడు దేవుణ్ణి మొదటి సారి ముఖాముఖిగా చూస్తున్నట్లు, ఈ పని కోసం దేవుడు తనను పిలుస్తునట్లు తనకు అనిపించిందని" తన డైరీలో ఐడా స్కడ్డర్ రాసుకొంది. ఆ రోజు రాత్రి దేవుని పిలుపు ముందు తన యొక్క మిగతా కలలు, ఆశలన్నీ కొట్టుకుపోయాయి.

## మెడిసిన్ చదువు, భారతదేశ ప్రయాణం

మెడిసిన్ చదవాలనే సంకల్పంతో ఐడా స్కడ్డర్ అమెరికాకు బయలుదేరుతుంది. అక్కడ మెడిసిన్ చదవడానికి సంవత్సరానికి 150 డాలర్ల ఖర్చు అవుతుంది. ఆమె దగ్గర కేవలం 10 డాలర్లు మాత్రమే ఉన్నాయి. ఆ డబ్బు గురించి ఆమె అందోళన చెందుతూ ఉన్నప్పుడు దేవుడు అద్భుతమైన రీతిలో



సహాయం చేశాడు. ఆమెను మెడికల్ మిషనరీగా ఇండియాకు పంపే విషయంలో రిఫార్మ్‌డ్ చర్చ్ ఉమెన్స్ ఆక్జిలరీ బోర్డు ముందుకు వచ్చి మెడిసిన్ విద్యకు అవసరమయ్యే ఖర్చును భరిస్తామని చెప్పారు. న్యూయార్క్ లోని కోర్నెల్ మెడికల్ కళాశాల నుండి తన వైద్య విద్యను 1899 సం॥లో పూర్తిచేసింది.

ఆమె భారత దేశానికి మరలా తిరిగిరావడానికి ముందు వెల్లూరులో ఒక పెద్ద ఆసుపత్రిని నిర్మించాలనే ప్రణాళికను మిషన్ బోర్డ్ వారు వేశారు. ఆ ఆసుపత్రి నిర్మాణానికి కావలసిన 8000 డాలర్ల నిధులను సమకూర్చే బాధ్యతను ఐడా స్కడ్డర్‌కి అప్పగించారు. ఆమె దాదాపు 3 నెలలు నిధుల కోసం అనేక సంఘాలను, సంస్థలను సందర్శించి, అవసరాన్ని వాళ్ళ ముందు ఉంచినా కేవలం కొన్ని వందల డాలర్ల నిధులను మాత్రమే సమకూర్చగలిగింది. ఆమె ఇండియాకు వెళ్లడానికి ఇంకా కేవలం కొన్ని రోజుల సమయం మాత్రమే ఉంది. ఆమె నిధులు సమకూర్చ లేకపోతే ఇండియాలో పెద్ద ఆసుపత్రిని నిర్మించి, తన తండ్రితో పాటు వైద్యురాలిగా పనిచేయాలనే ఆశ తీరదేమో అని చాలా నిరుత్సాహపడింది. అయితే దేవుడు అద్భుతంగా ఆ అవసరతను తీర్చాడు. ఐడా స్కడ్డర్ తన చెల్లితో ఆ ఆసుపత్రి అవసరత, భారతీయ మహిళల దయనీయమైన స్థితిని వివరిస్తున్నప్పుడు విని చలించిపోయిన ఆమె యొక్క సహోదరుడు అయిన రాబర్ట్ షెల్ ఈమెను ఇంటికి పిలిచి ఆమెకు 10,000 వేల డాలర్లను ఇచ్చి, నిర్మించబోయే ఆసుపత్రికి చనిపోయిన తన భార్య యొక్క జ్ఞాపకార్థం ఆమె పేరును పెట్టమని అడిగాడు. అంతేకాకుండా కట్టబోయే ఆసుపత్రికి కావలసిన వైద్య పరికరాలను, సామాగ్రిని కూడా అతడే కొన్నాడు. అతని ఉదారమైన దాతృత్వాన్ని బట్టి ఎన్ని ప్రాణాలు కాపాడబడతాయో అని తన మనస్సులో అనుకొన్నది ఐడా స్కడ్డర్.

ఆమె ఉన్నత ఉద్యోగ అవకాశాలను, సౌకర్యవంతమైన, సురక్షితమైన అమెరికా జీవితాన్ని విడిచిపెట్టి, వివాహ జీవితానికి స్వస్తి చెప్పి 22 నవంబర్ 1899వ సం॥లో ఐడా స్కడ్డర్, ఆమె స్నేహితురాలు యానీ హ్యాన్‌కాక్, వైద్య సామాగ్రితో న్యూయార్క్ నుండి ఇండియాకు వెళ్ళడానికి ఓడ ప్రయాణం ప్రారంభించారు. 1 జనవరి 1900 సం॥లో ఆమె ఇండియా గడ్డమీద అడుగుపెట్టింది.

ఆమె తన తండ్రితో పాటు క్లినిక్‌లో పని చేయడం ప్రారంభించింది. ప్రారంభంలో ఎవ్వరూ ఆమెను నమ్మేవారు కాదు. ఆమె మహిళా వైద్యురాలు కాబట్టి ఆమె దగ్గరకు చికిత్స కోసం ఏ పురుషుడు, మహిళ కూడా రాలేదు. అందుకు ఆమె చాలా బాధపడింది, క్రుంగిపోయింది. మూడు వారాల తర్వాత ఒక వృద్ధ మహిళ దగ్గరకు వెళ్ళే అవకాశం దేవుడు అనుగ్రహించాడు. అందుకు ఆమె చాలా సంతోషించింది. ఐడా స్కడ్డర్ ఆ వృద్ధ మహిళ పట్ల చూపించిన ప్రేమ, శ్రద్ధను చూసి ఆకర్షితులైన చుట్టు ప్రక్కల మహిళలు మమ్ముల్ని చూడడానికి మరలా రావాలని అడిగినప్పుడు ఆమె చాలా ఆనందపడింది. తన తండ్రితో పాటు వెల్లూరులోని క్లినిక్‌లో పనిచేస్తూ ఉండేది. ఆమె అనుభవజ్ఞుడు, నైపుణ్యం గల తన తండ్రి ఆధ్వర్యంలో ఒక ఆసుపత్రిని ప్రారంభించాలని ఆశపడింది గానీ ఆమె ఇండియాకు వచ్చిన 5 నెలల తర్వాత ఆమె తండ్రి మరణించాడు. ఆమె అదే సంవత్సరం అంటే 1900 సం॥లో తన తండ్రి యొక్క బంగ్లాలో ఒకే ఒక బెడ్‌తో డిస్పెన్‌సరీని ప్రారంభించి అక్కడ రెండు సంవత్సరాల పాటు మహిళలకు వైద్య సేవలను అందించింది.

తన భార్య జ్ఞాపకార్థం, తన భార్య పేరు ఆ ఆసుపత్రికి పెట్టాలని కోరుతూ అమెరికాలోని తన సహోదరుడు ఇచ్చిన డొనేషన్‌తో ఆమె 1902 సం॥లో 40 పడకల హాస్పిటల్‌ని నిర్మించి, దానికి 'మేరి టైబర్ షెల్' అనే పేరుపెట్టి దానిని ప్రారం భించింది. అప్పటి నుండి ఆమె తన సమయాన్ని ఎక్కువగా దానిలో గడుపుతూనే, విరాళాల కోసము తిరుగుతూ ఉండేది. ఆమె పని ఒత్తిడి వల్ల చాలా అలసి పోయేది. ఐడా స్కడ్డర్ తన మొదటి ఆపరేషన్‌ను ఎటువంటి సహాయకులు లేకుండా చేసింది. 1906 సంవత్సరము కల్లా ఆసుపత్రిలో వైద్యము అందించే రోగుల సంఖ్య 40,000కి చేరింది.

ఐడా స్కడ్డర్ దర్శనం కేవలం వైద్యం అందించడం మాత్రమే కాదు గానీ ఇతరులకు శిక్షణ ఇవ్వడం కూడా. అందుచేత ఆమె ఆసియాలోనే మొట్టమొదట మహిళా నర్స్‌లకు ట్రైనింగ్ ఇచ్చే నర్సింగ్ కాలేజి ప్రారంభించింది. 1908వ సం॥ కల్లా 15 మంది ఆ నర్సింగ్‌లో కాలేజిలో అన్ని మత విశ్వాసాల నుండి జాయిన్ అవ్వడం ఆమెకు ఎంతో సంతోషాన్ని కలిగించింది.





చుట్టు ప్రక్కల గ్రామాల్లో ఉన్న రోగులకు సేవ చేయడం కోసం1909వ సం॥లో ఆమె రోడ్డు ప్రక్కల డిస్పెన్సరీలను ప్రారంభించింది. ఇది కఠినమైన అనుభవంగా ఉండేది. అయినా ప్రజలను రీచ్ అవ్వడానికి ప్రభావవంతమైన మార్గం కోసం భారంతో ప్రార్థిస్తూ ఉండేది. దేవుడు అద్భుతమైన రీతిలో సహాయం చేశాడు. అమెరికా నుండి ఒక వ్యక్తి ఫ్యుగోట్ అనే కారును పంపాడు. తద్వారా ఆమె ఎక్కువ ప్రదేశాలను సునాయాసంగా చేరుకోవడానికి వీలయ్యింది. ఆ కారులో డ్రైవర్, ఐడా స్కడ్డర్, సలోమి, ఒక మహిళా క్రైస్తవ బోధకురాలు వెళ్ళేవారు. దానిని చూసి అక్కడి స్థానిక ప్రజలు దెయ్యం వస్తుందని భయంతో కేకలు వేస్తూ దూరంగా పరుగెత్తేవారు. కొంతకాలానికి ఈ కారు కోసం ప్రజలు ఎదురుచూసే పరిస్థితులు ఏర్పడ్డాయి. ఆమె ప్రతిరోజు రోడ్డు ప్రక్కల డిస్పెన్సరీల ద్వారా 300 మందికి వైద్యము అందించేది.

అప్పటివరకూ ఆమెకు సహకారిగా ఉన్న లోయిస్ హార్ట్ మదనపల్లి ఆసుపత్రికి బదిలీ అవ్వడం వలన 40 సంవత్సరాల ఐడా స్కడ్డర్ ఒక్కరే హాస్పిటల్, రోడ్డు ప్రక్కల నిర్వహించే డిస్పెన్సరీలను నిర్వహించే బాధ్యత తీసుకోవాల్సి వచ్చింది. డాక్టర్స్ కొరత ఎక్కువగా ఉందని గ్రహించి ఈ కొరతను తీర్చడానికి, మహిళా వైద్యుల కోసం ఒక మెడికల్ కాలేజీని తానే ప్రారంభిస్తే ఎలా ఉంటుంది? అనే ఆలోచన ఆమె మనస్సులో మెదిలింది. రాబోయే తరాలకు భారతీయ వైద్యులను తయారుచెయ్యాలనే దర్శనంతో ఆమె ఈ ఆలోచన చేసింది.

మిగిలినది వచ్చే సంచికలో....

**– డా. పి. నాసరయ్య,** వైజాగ్





# నువ్వైనా నా పని చేస్తావా!

సాయంత్రం ఆరు గంటలకు తమ తోటలోని చెట్లపై వాలిన పక్షుల కిలకిల రావాలు వింటూ, చెట్ల మధ్యలో నుండి అనేక వింత రంగులు పులు ముకొని ఉన్న ఆకాశాన్ని చూస్తూ, ఎరుపెక్కిన సూర్యుని అస్తమయాన్ని ఆకుల మధ్యలో నుండి చూస్తూ, తోటలో ఉన్న సిమెంట్ బెంచి మీద కూర్చుని వేడి వేడి టీ తాగుతూ ఉంది గ్రేస్. అప్పుడే ఎదురుగా ఉన్న గేట్ తీసుకుని లోపలికి వస్తున్న తన యంపిసి చెల్లి సూజన్ రావడం గమనించి ఇక్కడికి రమ్మని చేసైగ చేయగానే సూజన్ వచ్చి తన పక్కన కూర్చుంది. గ్రేస్, సూజన్‌కి కూడా టీ ఇచ్చి తన పక్కనే కూర్చొని తన కాలేజి విషయాలు, స్టడీస్ విషయాలు కనుక్కొంటున్నప్పుడు సూజన్ అన్యమనస్కంగా ఉండటం గమనించి 'ఏం చెల్లీ అలా ఉన్నావు? దేని గురించి ఆలోచిస్తున్నావు? అని అడిగింది'. దానికి సూజన్ 'ఏమిలేదు అక్క మొన్న మిషన్స్ రిట్రీట్ జరిగింది కదా, హాస్టల్‌కు వెళ్ళి అక్కడ విన్న విషయాల గురించి ఆలోచిస్తూ నిద్రపోయాను. రాత్రి నాకు ఒక కల వచ్చింది, కలలో దేవ దూత నాతో మాట్లాడింది అక్కా. నేను కూడా దేవదూతను కొన్ని విషయాలు అడిగాను అని చెప్పింది'. అవునా! నిజమా!! ఏమి మాట్లాడుకున్నారో చెప్పు అని అడిగింది గ్రేస్ ఆసక్తిగా. సూజన్ చెప్పడం మొదలు పెట్టింది.

**దేవదూత:** నిన్న జరిగిన మిషన్స్ రిట్రీట్‌లో నువ్వు చాలా విషయాలు విన్నావు కదా! దానిలో చెప్పినవన్నీ నీకు అర్థం అయ్యాయా?

**సూజన్:** కొన్ని అర్థం అయ్యాయి, కొన్ని అర్థం కాలేదు, ముఖ్యంగా దేవుని మనసు అనే దాని గురించి అర్థం కాలేదు. మీకు తెలుసా దేవుని మనస్సు ఏంటో?

**దేవదూత:** నాకేకాదు, ఆయన మనస్సు మా దూతలందరికీ బాగా తెలుసు. ఆయన మనస్సు నశించిపోయే మనుష్యుల చుట్టూ తిరుగుతుంది. నువ్విది విన్నావా ఒక యజమానుడికి వంద గొర్రెలు ఉంటే, అందులో ఒక గొర్రె తప్పిపోతే 99 గొర్రెలను వదిలిపెట్టి తప్పిపోయిన ఒక గొర్రె కోసం ఆయనే వెతుక్కుంటూ వెళ్ళాడని. అది ఎవరో కాదు యేసయ్యే. అలాగే 10 కాసులు ఉంటే వాటిలో పోయిన ఒక కాసు గురించి రాత్రంతా వెతకడం, అది కూడా యేసయ్యే. ఇద్దరు కుమారులలో తప్పిపోయిన కుమారుడి కోసం వెతికే తండ్రి యేసయ్యే. అదే ఆయన మనస్సు. నశించిన దానిని వెదకి రక్షించే మనస్సు. ఆయనకు మాకంటే మీరు చాలా అమూల్యమైన వారు, ప్రశస్తమైనవారు. అందుకే ఆయన మిమ్మల్ని ఎంతో ప్రేమించి మీ అందరికోసం పరలోకం వదిలి ఈ భూమి మీదకు మానవునిలా వచ్చి, మీరు నిత్యజీవంలో ఆయనతో పాటు ఉండాలని సిలువ మీద చనిపోయాడు. ఇది సృష్టిలో ఇంకెవరికీ లేని భాగ్యం.

**సూజన్:** అవును నిజమే. అందుకే నేను కూడా ఆయన ఇచ్చిన రక్షణను పొందాను.



**దేవదూత:** మరి నీవు పొందుకున్న రక్షణ గురించి, నిత్య జీవం గురించి ఈ విషయాలు తెలియని ఎవరికైనా, ఎప్పుడైనా చెప్పావా?

**సూజన్:** చెప్పలేదు, నాకంటే పెద్ద వాళ్ళు సీనియర్ అక్కలు, గ్రాడ్యుయేట్స్, స్టాఫ్, పాస్టర్స్ ఇంకా చాలా మంది విశ్వాసులు ఉన్నారుగా వాళ్ళు చెప్తారని ఊరుకున్నాను.

**దేవదూత:** కోత విస్తారము పని వారు కొద్దిమంది పనివారి కోసం కోత యజమానుడిని వేడుకొనండి అనే వాక్యం నువ్వు విన్నావా?

**సూజన్:** నిన్న రిట్రీట్లో విన్నాను, కోత చాలా విస్తారంగా ఉందంట. ఈ 2025 లో కూడా ఇంకా యేసుప్రభువు అనే పేరు కూడా వినని వారు 270 కోట్లమంది ఉన్నారంట, వాళ్ళల్లో ఎక్కువమంది ముస్లింలు అంట. ఇప్పుడు ఉన్న విశ్వాసులే చాలా తక్కువ మంది అంట, వాళ్ళల్లో పనిచేసే వాళ్ళు ఇంకా తక్కువ మంది అంట, వాళ్ళను కూడా సాతాను ఆటంకపరుస్తూ, హింసిస్తూ వుంటాడంట. అలా హింసించే దేశాల్లో మన దేశం పదవ స్థానంలో ఉందంట.

**దేవదూత:** మరి పనివారి కోసం ప్రార్థన చేస్తావా? నువ్వు పని చేస్తావా?

**సూజన్:** ఇక నుంచి చేస్తాను. అయినా దేవ దూతలు చాలా మంది ఉన్నారు కదా! మీరు కూడా దేవుని పరిచారకులే కదా? మరి మీరు చేయొచ్చుగా పరిచర్య?

**దేవదూత:** మాకు ఆ భాగ్యం లేదు. సువార్తను ప్రకటించే గొప్ప పనిని ఆయన మీకు మాత్రమే ఇచ్చాడు. మీరే రాజులైన యాజక సమూహము. మీరే ఆయన ఏర్పాటు చేసుకున్న జనాంగము. మీరే ఆయన సొత్తయిన ప్రజలు. అందుకే సర్వలోకానికి వెళ్ళి సర్వసృష్టికి సువార్తను ప్రకటించండి, సర్వజనులను శిష్యులుగా చేయండి అనే ఆజ్ఞ ఆయన మీకే ఇచ్చాడు. అదే మాకు ఇచ్చుంటే ఎప్పుడో ప్రపంచం మొత్తం సువార్తను ప్రకటించి ఉండేవాళ్ళం. నశించిపోయే వారికోసం, మీలాంటి విశ్వాసుల కోసం దినమంతా ఆయన కార్చే కన్నీళ్ళు చూడలేకపోతున్నాం.

**సూజన్:** అదేంటి విశ్వాసుల కోసం ఆయన కన్నీళ్ళు కార్చడం ఎందుకు? రక్షించబడ్డాం కదా?

**దేవదూత:** తప్పిపోయిన కుమారుడి కథలో తండ్రి పెద్ద కుమారుడు తనతోనే ఉన్నా పెద్ద కుమారుడి మాటలను బట్టి, ప్రవర్తనను బట్టి ఎంతో బాధపడుతూనే ఉన్నాడు. తప్పిపోయిన తమ్ముడి గురించి బాధలేదు, వేదన లేదు. తమ్ముడు తిరిగివస్తే సంతోషం లేదు. ఇప్పటి విశ్వాసులు ఎక్కువమంది అలాగే ఉన్నారు. నరకానికి పోయేవారి గురించి బాధలేదు, తప్పిపోయిన వారిని తిరిగి తీసుకొని వచ్చే మనసులేదు, రక్షించబడిన వారిని చూసి ఆనందపడి వారిని శిష్యులనుగా తయారుచేయాలనే కోరికాలేదు. వీరిని బట్టి ఆయన ఏడుస్తూనే ఉంటాడు మరి.

**సూజన్:** అవునా? నాకు తెలిసినంతవరకు ఎక్కువమంది విశ్వాసులు దేవుని పని ఏదొకటి చేస్తూనే వుంటారు, రోజూ ప్రార్థన చేస్తారు, వాక్యం ధ్యానిస్తారు, ఎప్పుడూ ప్రోగ్రామ్స్‌కు వెళ్తూనే వుంటారు, వాక్యం వింటూనే ఉంటారు, నేర్చుకుంటూనే వుంటారు, చర్చిలకు మానకుండా వెళ్తూనే వుంటారు.

**దేవదూత:** అవును నీవు చెప్పింది నిజమే. అయితే ఇవన్నీ పూర్ణ హృదయంతో చేస్తేనే దేవుని మనస్సు తెలిసేది. ఆయన బాధ, వేదన, ఆయన కన్నీళ్ళు ఇవన్నీ అర్థం అయ్యేవి. ఆయన ఏమి చేయమంటున్నాడో, ఏమి వద్దంటున్నాడో తెలిసేది. సాతాను పెట్టే ఆటంకాలు, అడ్డుబండలు, వాడు వేసే వలలు, ఉచ్చులు అర్థమయ్యేవి.

**సూజన్:** మేము ఇవన్నీ పూర్ణ హృదయంతో చేయడం లేదా? సాతాను ఏమి చేస్తాడు?

**దేవదూత:** అయ్యో వాడు చాలా చేస్తాడు. దేవుని చిత్తం జరగడం వాడికి ఇష్టం ఉండదు, అందుకని దానికి వ్యతిరేకమైన పనులు అన్యజనుల ద్వారా, శరీరానుసారుల ద్వారా చేయిస్తాడు. అది మీకు తెలియనివ్వడు, అర్థం కానివ్వడు.

చాలాసార్లు మీ అందరిని కూడా మేము దేవుని కోసం ఏదో ఒకటి చేస్తున్నామనే భ్రమలో ఉంచుతాడు. దేవుడు వెలిగించిన ఆత్మీయ నేత్రాలను మసకబారుస్తాడు. అనవసరమైనవి ఫోకస్ చేసేలా చేస్తాడు. సహవాసాల్లో, కుటుంబాల్లో, వ్యక్తుల మధ్యలో మనస్పర్ధలు తెచ్చి వాటి గురించి మాత్రమే ఆలోచించేలా చేసి మీ దర్శనాన్ని మీరే డీవియేట్ చేసుకునేలా చేస్తాడు. కంఫర్ట్ జోన్‌లో ఉండమని చెప్తాడు. దేవుడు అన్నీ అర్థం చేసుకుంటాడులే అని చెప్తాడు. ఒకవేళ ఇవన్నీ దాటుకుని ఎవరైనా దేవుని చిత్తానుసారంగా పరిచర్య చేస్తుంటే వాళ్ళని ఆపడానికి ఎన్నో శోధనలు, పరీక్షలు, శ్రమలు, మాటలు, నిందలు, అవమానాలు, ఒక్కోసారి అనారోగ్యం తీసుకొస్తాడు. అంతిమంగా వాడు మిషన్స్ గురించి అసలు విననివ్వడు.ఎందుకంటే దానిలో కోతెంత విస్తారమో, ఎంతమంది నశించిపోతున్నారో తెలుస్తుంది. విశ్వాసులు ఇవి తెలుసుకుంటే సాతానుని ఎదిరించి, శ్రమలకు ఓర్చి సువార్త అందని వారికి సువార్తను అందిస్తారేమో, వారి రక్షణ కొరకు ప్రార్థిస్తారేమో, వారిని శిష్యులుగా తయారు చేస్తారేమో అని సాతాను భయం. ఓడిపోయిన సాతానుని ఎదిరించి విశ్వాసులు పని చేయలేక పోతున్నారని, మోసగాడైన వాడి చేతిలో ఇంకా మోసపోతున్నారని, అబద్ధికుడైన వాడి అబద్ధాలను ఇంకా నమ్ముతున్నారని, ఈలోపు అనేకమంది చనిపోయి నరకానికి వెళ్తున్నారని దేవుడు దు:ఖపడుతున్నాడు.

**సూజన్:** నిజమా? అయితే దేవుడు మమ్మల్ని బట్టి సంతోషపడాలంటే మేము ఏమి చేయాలి?

**దేవదూత:** అలా అడిగావు బాగుంది. మొదటిగా విశ్వాసులందరికీ కోతెంత విస్తారమో తెలియచేయాలి దానికోసం మిషన్స్ రిట్రీట్లు, మిషన్స్ బైబిల్ స్టడీస్ ప్లాన్ చేయాలి. ప్రేయర్ డేస్‌లో తప్పకుండా సువార్త అందని ప్రజలకోసం, దేశాల కోసం ప్రార్థన చేయాలి. హింసలను ఎదుర్కొని పరిచర్య చేయడం నేర్చుకోవడానికి మిషనరీస్ బయోగ్రఫీలు చదివేలా ప్రోత్సహించాలి. వాక్యాన్ని ధ్యానం చేసేటప్పుడు దేవుని మనస్సు అర్థం చేసుకోవాలి. సువార్త అస్సలు వినని విద్యార్థుల కోసం ప్రత్యేకమైన ప్రోగ్రామ్స్ పెట్టుకోవాలి, వారికోసం త్యాగపూరితంగా ఇవ్వడం చేయాలి. మీ భారత దేశంలో ఎక్కువ మంది అన్యులు, వారు కూడా ఎక్కువగా ఉత్తర భారత దేశంలో ఉన్నారు. వీరికోసం ప్రార్థన చేయాలి, ఇవ్వాలి. దేవుడు వారి మధ్యకు వెళ్ళి పని చేయమంటే అక్కడికి వెళ్ళి చేయాలి. మీ స్టేట్ అడాప్టెడ్ స్టేట్స్ అయిన రాజస్థాన్, జమ్మూ కాశ్మీర్, పంజాబ్ రాష్ట్రాల కొరకు ప్రత్యేకంగా ప్రార్థన చేయాలి. భారత దేశంలోని ప్రతి కాలేజి కొరకు ప్రార్థన చేయాలి. మిషన్స్ ట్రిప్స్‌కు వెళ్ళి అక్కడ అడుగుపెట్టి అక్కడి వారి కోసం ప్రార్థన చేయాలి.



మిషనరీలు ఎన్నో శ్రమలు పొందుతూ ఉంటారు. అనారోగ్య సమస్యలు, ఆర్థిక సమస్యలు, కుటుంబ సమస్యలు, ఒంటరితనం, నిరాశ, భయాలు, దురాత్మల ప్రభావాలతో బాధపడుతూ ఉంటారు, కాబట్టి వారితో మాట్లాడుతూ వారిని బలపరచాలి, వారితో కలిసి ప్రార్థించాలి.

**సూజన్:** ఇవన్నీ విశ్వాసులంగా మేము చేయట్లేదు, ఇది యేసయ్యను బాధిస్తుంది కదా?

**దేవదూత:** అవును. నువ్వెప్పుడైనా నాపేరే తెలియని ప్రజలు ఎందరో వున్నారు అనేపాట విన్నావా? ఆ పాట ఇప్పటికీ ఏసయ్య పాడుతూనే ఉన్నాడు. విశ్వాసులు ఆయనకు ఎన్నో మాటలు ఇచ్చి చేస్తామని చెప్పి మోసం చేస్తూనే ఉన్నారు. అందరూ సొంతపనులనే చేసుకుంటారు, దేవుని పని చేయరు. అయినా ఆయన వారిని ఇంకా నమ్ముతూనే ఉన్నాడు. వాళ్ళ గురించి యేసయ్య 365 రోజులు 24 గంటలు తండ్రిని ఇప్పటికీ వేడుకుంటూనే ఉన్నాడు.

**సూజన్:** అలా ఆయన కళ్ళల్లో నుంచి జాలువారిన కన్నీళ్ళు ఆయన చేతిపై పడ్డాయి. నేను ఆ చేతిని చూడగానే చేతిలో గాయాలున్నాయి, ఆయన పాదాలు చూడగానే పాదాలలో గాయాలు వున్నాయి. అప్పుడు ఆయన ముఖం చూడగానే నువ్వైనా నా పని చేస్తావా! అని అర్థిస్తున్నట్లుగా చూస్తున్న ఆయన చూపు నా గుండెను బద్దలు చేసింది అక్క.

వెంటనే మెలకువ వచ్చింది అని చెప్తూ గ్రేస్ అక్క మొహం వైపు చూడగా గ్రేస్ అక్క కళ్ళల్లో నుండి నీరు రావడం చూశాను. ఇద్దరం ప్రార్థన చేసి పని చేస్తామనే నిర్ణయాలతో సంభాషణ ముగించాము.

**– దేవుని మనస్సు అర్థం చేసుకొంటున్న ఓ సహోదరి**

Registered with the Registrar of News Papers of India **RNI No. 52991/94**
Postal Registration No.: **GTR/59/2024-2026**

**Date of Printing: 25-02-2025**
**Date and place of posting: 27th and 28th of every month at GUNTUR RMS**

Printed at Bhashyam Publishers, Amaravathi Road, Guntur 522 007. by Mr. P. Basavaiah
Edited by Mr. B.J. Lazarus and published by UESI-AP, Nambur - 522 508



# సుఖవలయం

ఇదిగో ...
మళ్ళీ నేనొక ఉద్యమానికి ఊపిరి పోస్తున్నాను
బండలా పేరుకు పోయిన గుండెను
అడుగుకంటూ తవ్వి పోస్తున్నాను

ఎక్కడి వారమక్కడే అతుక్కుపోయి
ఏమాత్రం కదల్లేని కుంటితనాన్నీ,
ఎవరి పనుల్లో వారు మునిగిపోయి
పొలాల వైపు చూడలేని గుడ్డితనాన్నీ

నలుగురిలో మళ్ళీ నిలదీస్తున్నాను!
సిలువలో కారిన రక్తం
యెరూషలేములోనే ఇంకిపోలేదు
ప్రపంచాన్ని అంచులదాకా తడిపింది!

ఆకలి తీర్చుకున్న ఓ భిక్షగాడా
మిగతా భిక్షగాళ్ళ సంగతి ఏమయ్యింది?

వెచ్చని దుప్పట్లో కాళ్ళు ముడుచుకుని
దేవుని రాజ్యం కోసం కలవరిస్తూ
సుఖాలకెంత సులువుగా బలైపోయాము!
మెస్సీయ గానీ ఆయన శిష్యులు గానీ
అనుభవించని హాయి
మన జీవితాల్లోకి ఎలా వచ్చిందో
ఇప్పుడిక ఆరా తియ్యాలనే అనుకున్నాను!

నరాల్లో నింపుకోవాల్సిన కమిట్‌మెంట్‌ని
మనమిప్పుడు పేపర్లకే పరిమితం చేశాం!
ఏ అడవిలో ఎవరు నాశనమైతే మనకేంటి
క్రమం తప్పకుండా మన కార్యక్రమాలు
జరుగుతూనే ఉన్నాయిగా !

గోల్డ్‌మెడల్స్‌ని గోడకు వేలాడదీసి
ఆటవికుల్లో నువ్వు ఒక ఈకగా
అల్లుకుపోయిన ఓ ప్రేషిత* వీరుడా!
నిన్ను నిలువెల్లా దహిస్తున్న అగ్ని
మమ్మల్ని రవ్వంతైనా రగిలించదెందుకని!

నువ్వొదిలొచ్చిన ఆస్తిపాస్తులు గానీ
ప్రతిరోజూ నువ్వుండే పస్తులు గానీ
ఎంతకష్టమైనా నిన్ను కట్టిపెట్టదు!
లోకమంతా ఒక్కటై ముట్టడించినా
నీవు వెనుదిరగవు వెన్నుచూపవు
నీకు కనబడే బహుమానం
మాకు కనిపించదెందుకని!

* మిషనరీ

– డా. తాళ్ళూరి ప్రసాద్